



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY







SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 248 | తూర్పుగోదావరి జిల్లా | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | శనివారం 30 మే 2026 | పేజీలు : 12 | వెల : 2/-


### ఏపీలో రూ.22వేల కోట్లతో

# భారీ విద్యుత్ కారిడార్





- రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ కారిడార్‌కు ప్రతిపాదనలు
- 18 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్‌ను ప్రధాన గ్రిడ్‌కు అనుసంధానించేలా ప్రణాళిక
- ప్రభుత్వ భవనాలు, పాఠశాలల్లో సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు వేగవంతం చేయాలని ఆదేశం
- పీఎం సూర్యఘర్ పథకంలో ఏపీని అగ్రస్థానంలో నిలపాలని సీఎం చంద్రబాబుసూచన
- రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణకు వరల్డ్ ఎకనమిక్ ఫోరంతో కలిసి పనిచేయాలని నిర్ణయం

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌ను గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మార్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిని ప్రోత్సహించడంతో పాటు, దానిని సమర్థంగా గ్రిడ్‌కు అనుసంధానించేందుకు భారీ ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగా, సుమారు రూ.22 వేల కోట్ల వ్యయంతో 'గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఫేజ్-3' నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ ప్రాజెక్టు ద్వారా 18 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీని ప్రధాన గ్రిడ్‌కు అనుసంధానించాలని లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యుత్ శాఖ పనితీరుపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రీన్ ఎనర్జీ కారిడార్, విద్యుత్ సరఫరా, పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ వంటి పథకాల అమలు పురోగతిపై విస్తృతంగా చర్చించారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఫేజ్-3 కింద చేపట్టనున్న చర్యలపై సీఎం ఆరా తీయగా, అధికారులు పూర్తి వివరాలు అందించారు. రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే 18 గిగావాట్ల హరిత విద్యుత్‌ను ప్రధాన గ్రిడ్‌కు అనుసంధానించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందులో 11 గిగావాట్ల మిగతా .. 2లో..

### మహానాడు విజయాన్ని

# అందరికీ అంకితం చేస్తున్నా

**విజయవంతంగా ముగిసిన టీడీపీ మహానాడు : నారా లోకేష్**



**మంగళగిరి, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన మహానాడు నిన్న విజయవంతంగా ముగిసింది. ఈ నేపథ్యంలో టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ స్పందిస్తూ... మహానాడు విజయవంతం కావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని చెప్పారు. కోట్లాది మంది టీడీపీ కుటుంబ సభ్యుల ఆశీస్సులతో తాను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యానని... తాను ఈ పదవిని చేపట్టిన తర్వాత జరిగిన తొలి మహానాడు ఇదని అన్నారు. టీడీపీ టీమ్ కృషి వల్ల మహానాడు విజయవంతం అయిందని చెప్పారు. మహానాడు 2026 విజయాన్ని పార్టీ నేతలు, కార్యకర్తలు, మహానాడు కమిటీలు, పార్టీ కార్యాలయ యంత్రాంగం, బ్యాక్ ఆఫీస్, సాంకేతిక సిబ్బంది, MYTDP, ITDP, అనుబంధ సంఘాలు, మీడియా మిత్రులు, సోషల్ మీడియా అభిమానులు, ఎన్ఆర్ఐలు, మిత్రపక్షాలు, ప్రజలు, భద్రతా సిబ్బంది అందరికీ అంకితం చేస్తున్నానని తెలిపారు. మీ కృషికి శిరస్సు వంచి నమస్కారం చేస్తున్నానని చెప్పారు. నెల్లూరులో జరగాల్సిన మహానాడును ప్రధాని మోదీ పిలుపుతో, అందరి ఆమోదంతో హైబ్రిడ్ విధానంలోకి మార్చామని లోకేశ్ తెలిపారు. సంక్షోభాలను అవకాశాలుగా మలుచుకోవడాన్ని చంద్రబాబు మనకు నేర్పారని... ఆ నేర్పును హైబ్రిడ్ మహానాడుకు ఉపయోగించి విజయవంతం చేశామని చెప్పారు. ఇప్పుడు ప్రతి ఇల్లు, ప్రతి పల్లె మహానాడుకు వేదిక అయిందని అన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తీర్మానం చేయడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశం అయిందని... ఇది మహానాడు సాధించిన మరో ఘన విజయమని చెప్పారు.

### మావోయిస్టులకు పేలుడు

# పదార్థాల సరఫరా

**ఏపీలో ముగ్గురిపై ఎన్ఐఏ చార్జిషీట్**




**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో మావోయిస్టులకు పేలుడు పదార్థాలు, ఇతర వస్తువులు సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ముగ్గురు వ్యక్తులపై చార్జిషీట్ దాఖలు చేసింది. శుక్రవారం విశాఖపట్నంలోని ఎన్ఐఏ ప్రత్యేక కోర్టులో ఈ చార్జిషీట్‌ను సమర్పించినట్లు అధికారులు వెల్లడించారు. నిందితుల్లో నక్కా దేవిడ్ రాజ్ అలియాస్ డేవిడ్, విజయ్ విశ్వాస్‌లను మావోయిస్టు పార్టీ ఓవర్ గ్రౌండ్ వర్కర్లుగా (ఓజీడబ్ల్యు) గుర్తించారు. వీరు పేలుడు పదార్థాలను అండర్ గ్రౌండ్‌లో ఉన్న మిగతా .. 2లో..

### పారిశ్రామిక కాలుష్య నివారణకు

# నిరంతర తనిఖీలు చేయాలి

**డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాలు**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** 'స్వచ్ఛ గోదావరి- పవిత్ర పుష్కరాల' నేపథ్యంలో అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు ఇచ్చారు. కాలుష్యరహిత గోదావరి, పుష్కరాల నిర్వహణకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. ఆరు జిల్లాల్లో 262 పుష్కర పంచాయతీలను గుర్తించారు. మురుగు రహిత పంచాయతీలుగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. మురుగు నీరు నేరుగా గోదావరిలో కలవకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. మున్సిపాలిటీ సామర్థ్యానికి తగిన విధంగా మురుగు శుద్ధి ప్లాంట్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. పీసీబీ మంజూరు చేసిన రూ.100 కోట్ల నుంచి కూడా నిధుల వినియోగించాలని ఆదేశించారు. రోజువారీ 104 మిలియన్ లీటర్ల మురుగునీరు జీవనదిని కలుషితం చేస్తోందన్నారు. ఇందులో గ్రామీణ ప్రాంతాల నుంచి 8.38 మిలియన్ లీటర్ల మురుగు నీరు గోదావరిలో కలుస్తోందని పేర్కొన్నారు. పారిశ్రామిక వ్యర్థాల్లో ఆంధ్ర పేపర్ మిల్లు వెదజల్లే రోజువారీ కాలుష్యమే 32 మిలియన్ లీటర్లు మిగతా .. 2లో..

### హైదరాబాద్‌లో కోట్ల రూపాయల

# భూకబ్జాకు యత్నం

**పరారీలో వైసీపీ మాజీ ఎమ్మెల్యే : డీసీపీ**
**ముగ్గురిని అరెస్టు చేసినట్లు వెల్లడించిన డీసీపీ**



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్ ప్రాంతంలో రూ.1,500 కోట్ల విలువైన భూమి కబ్జాకు యత్నించిన ఏపీకి చెందిన వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పరారీలో ఉన్నారని శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. డీసీపీ ఈరోజు మీడియా సమావేశం నిర్వహించారు. నకిలీ పత్రాలతో బ్రహ్మనాయుడు, మరికొందరు కలిసి గండిపేటలో భూమి కబ్జాకు ప్రయత్నించారని తెలిపారు. గండిపేట తహసీల్దారు ఫిర్యాదుతో ఈ విషయం వెలుగు చూసిందని అన్నారు. గండిపేట సర్వే నెంబర్ 18లో భూమిని కబ్జా చేసేందుకు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారని డీసీపీ వెల్లడించారు. నకిలీ పత్రాలను సృష్టించిన మిగతా .. 2లో..

# తితిదే కీలక నిర్ణయం

**శ్రీవాణి దర్శన టికెట్ల కేటాయింపులో మార్పులు**




**తిరుమల, విశ్వం వాయిస్ న్యూస్ :** భక్తుల సౌకర్యార్థం శ్రీవాణి ట్రస్ట్‌కు సంబంధించిన దర్శన టికెట్ల కేటాయింపులో పలు మార్పులు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) తెలిపింది. ప్రస్తుతం రోజుకు 1500 శ్రీవాణి టికెట్లను తితిదే ఆన్‌లైన్ ద్వారా అందుబాటులో ఉంచుతోంది. వీటిలో 500 దర్శన టికెట్లను మూడు నెలలు ముందుగానే ఆన్‌లైన్‌లో అడ్వాన్స్ బుకింగ్ కింద అందుబాటులోకి తీసుకొస్తోంది. మరో 200 శ్రీవాణి మిగతా .. 2లో..

### మున్సిపాలిటీల్లో

# డంపింగ్ యార్డులు లేకుండా చేస్తాం


**గుంటూరు, విశాఖలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు ఉన్నాయన్న నారాయణ**
**107 మున్సిపాలిటీల్లో ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్లు ఏర్పాటు చేయబోతున్నామని వెల్లడి**
**వైసీపీ ప్రభుత్వం 150 లక్షల చెత్తను వదిలిపోయిందని విమర్శ**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలను డంపింగ్ యార్డులు లేని పట్టణాలుగా మార్చేందుకు యత్నిస్తున్నామని ఏపీ మంత్రి నారాయణ చెప్పారు. ప్రస్తుతం గుంటూరు, విశాఖలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు ఉన్నాయని తెలిపారు. మరో ఆరు ప్లాంట్లను నెలకొల్పబోతున్నామని వెల్లడించారు. ఈలోగానే 107 మున్సిపాలిటీల్లో ఉత్పత్తి అయ్యే చెత్త నిర్వహణ కోసం ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్లు ఏర్పాటు మిగతా .. 2లో..

### కర్ణాటకలో రాజ్యసభ ఎన్నికలు


# రాహుల్ గాంధీతో షర్మిల భేటీ



**విశ్వం వాయిస్ న్యూస్ :** కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీతో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల భేటీ అయ్యారు. కర్ణాటకలో త్వరలో రాజ్యసభ ఎన్నికలు ఉన్నాయి. ఇలాంటి సమయంలో ఆమె పార్టీ అగ్రనాయకుడితో భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఢిల్లీలో జరిగిన ఈ భేటీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉన్నారు. కర్ణాటక నుంచి రాజ్యసభ సీటును షర్మిల కోరుతున్నట్లు మీడియాలో ప్రచారం సాగుతోంది. వైఎస్సార్‌టీపీని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేసిన సమయంలో షర్మిలకు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం రాజ్యసభ సీటును హామీ ఇచ్చిందని తెలుస్తోంది. ఇప్పుడు కర్ణాటకలో రాజ్యసభ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో, ఏపీలో పార్టీని బలోపేతం మిగతా .. 2లో..

### 2,407 కోట్ల ఒప్పందాలకు లెక్కలు చెప్పాలని


# ఈడీ నోటీసులు




**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** జగన్ ప్రభుత్వ హయాంలో గనుల శాఖలో జరిగిన అక్రమాల వ్యవహారంలో ఇటీవల సోదాలు చేసినట్లు ఈడీ తెలిపింది. ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. "ఈనెల 26న హైదరాబాద్, జైపుర్, కోయంబత్తూర్‌లో 8 చోట్ల సోదాలు నిర్వహించాం. ప్రతిమ, జీసీకేసీ, టర్న్‌కీ కంపెనీల్లో తనిఖీలు చేశాం. బోయిన్‌పల్లి శ్రీనివాసరావు, అశోక్‌కుమార్, వెంకటరెడ్డి ఇళ్లలో సోదాలు నిర్వహించాం. ఇసుక తవ్వకాల అక్రమ మైనింగ్‌లో టెండర్ నిబంధనలు ఉల్లంఘించారు. గనులశాఖ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి కొన్ని కంపెనీలకు మిగతా .. 2లో..

### న్యాయవాది స్విమ్మింగ్‌కు వెళ్తుండగా స్కార్పియోతో

# ఢీ కొట్టి హత్య : సీపీ సజ్జనర్



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** హైకోర్టు న్యాయవాది ఖాజా మొహిజుద్దీన్ హత్య కేసును ఛేదించామని హైదరాబాద్ సీపీ సజ్జనర్ తెలిపారు. ప్రమాదంలా కనిపించిన ఈ ఘటన వెనుక పక్కా కుట్ర ఉందని.. దర్యాప్తులో ఈ విషయం వెలుగులోకి వచ్చిందని చెప్పారు. శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో కేసు వివరాలను సీపీ వెల్లడించారు. "ఈ నెల 23న ఉదయం మొహిజుద్దీన్ స్విమ్మింగ్‌కు వెళుతుండగా స్కార్పియో వాహనంతో నిందితులు మిగతా .. 2లో..

### ఎస్ఐఆర్‌పై నేతలంతా

# సంపూర్ణ అవగాహనతో ఉండాలి

**తెలంగాణా సీఎం రేవంత్**



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)తో తలెత్తే సమస్యలపై నేతలంతా సంపూర్ణ అవగాహనతో ఉండాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. గాంధీభవన్‌లో నిర్వహించిన టీపీసీసీ రాజకీయ వ్యవహారాల సమావేశంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. లంబాడీ, ఆదివాసీ, వలస కార్మికులకు ఎస్ఐఆర్ పెద్ద సమస్య కావొచ్చన్నారు. "ఎస్ఐఆర్‌తో దళితులు, మైనార్టీలు, మహిళల ఓట్లు పోయే అవకాశముంది. దీనివల్ల తలెత్తే సమస్యలపై నేతలకు పూర్తి అవగాహన ఉండాలి. ఎస్ఐఆర్ కోసం అన్ని నియోజకవర్గాల్లోనూ మిగతా .. 2లో..

### 'ఏలియన్స్'.. అక్రమ వలసలపై

# వైట్‌హౌస్ వెబ్‌సైట్



**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికాలోని అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతోన్న ట్రంప్ యంత్రాంగం తాజాగా మరిన్ని చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగా 'ఏలియన్స్' పేరుతో కొత్తగా ఓ వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. అక్రమంగా నివసిస్తున్నట్లు అనుమానం ఉన్న వ్యక్తుల వివరాలు తెలియజేయాలని పిలుపునిచ్చింది. దేశంలోకి అక్రమంగా ప్రవేశించే విదేశీయులను 'ఏలియన్స్'గా డొనాల్డ్ ట్రంప్ వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. "60ఏళ్లుగా అమెరికా మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

### ఏపీలో రూ.22 వేల కోట్లతో

# భారీ విద్యుత్ కారిడార్

సౌర విద్యుత్, 7 గిగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్ ఉంటుందని వివరించారు. ఈ కారిడార్ కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,261 కిలోమీటర్ల మేర కొత్త ట్రాన్స్‌మిషన్ లైన్లు వేయనున్నట్లు వెల్లడించారు. దీంతో పాటు, 9,500 మెగావాట్ల సామర్థ్యంతో ముదిగుబ్బ, తలుపుల, రామాయపట్నం, పోరుమామిళ్ల, కొప్పాక ప్రాంతాల్లో ఐదు భారీ పూలింగ్ స్టేషన్లను నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని, దానికి అనుగుణంగా నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ కారిడార్ పూర్తయితే రాష్ట్రంలో ఏర్పాటయ్యే డేటా సెంటర్లకు నిరంతరాయ విద్యుత్ సరఫరా సాధ్యమవుతుందని, తద్వారా భారీ పెట్టుబడులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టును కాలపరిమితితో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**పీఎం సూర్యఘర్ అమలులో వేగం పెంచాలి**

ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం అమలులో ఏపీ ప్రస్తుతం దేశంలో నాలుగో స్థానంలో ఉందని, అగ్రస్థానానికి చేరేలా అధికారులు కృషి చేయాలని సీఎం ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన 1,35,821 ఇళ్లకు సోలార్ ప్యానెళ్లు అమర్చామని, మిగిలిన వాటిని ఆగస్టు నెలాఖరులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. బీసీ వర్గాలకు రూ.20 వేల సబ్సిడీతో 10 లక్షల ఇళ్లపై సోలార్ ప్యానెళ్లు బిగించే లక్ష్యాన్ని కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ భవనాలపై 200 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసే పనులు వేగవంతం చేయాలన్నారు. రెస్కో మోడల్‌లో, నెట్ మీటరింగ్ విధానంలో ఈ ప్రక్రియ చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. పైలట్ ప్రాజెక్టు కింద చిత్తూరు జిల్లాలోని 78 గురుకుల పాఠశాలలను ఎంపిక చేసినట్లు చెప్పారు. అలాగే, 2,898 హాస్టళ్లు, స్కూళ్లలో 'నెట్ జీరో' విధానంలో సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

**సాంకేతికతతో విద్యుత్ నష్టాలకు చెక్**

దేశంలోనే తొలిసారిగా స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీకి చెందిన 'ప్రవాహ్' సంస్థ సహకారంతో, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్ ద్వారా 'డిజిటల్ ట్విన్ గ్రిడ్' రూపొందిస్తున్నామని అధికారులు సీఎంకు వివరించారు. ఏపీఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ సాంకేతిక నష్టాలను తగ్గించేందుకు ఇది ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. మరోవైపు, రాష్ట్రంలో 131 ప్రాంతాల్లో 577 ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించినట్లు వెల్లడించారు. వచ్చే ఆరు నెలల్లో రాష్ట్రంలో గరిష్ట విద్యుత్ డిమాండ్ 12,226 మెగావాట్లకు చేరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. ఈ ఏడాది మే 21న రాష్ట్రంలో అత్యధికంగా 15,016 మెగావాట్ల గరిష్ట డిమాండ్ నమోదైందని గుర్తుచేశారు.

**సీఎంతో వరల్డ్ ఎకనమిక్ ఫోరం బృందం భేటీ**

సమీక్ష అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబుతో వరల్డ్ ఎకనమిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) ప్రతినిధుల బృందం భేటీ అయింది. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసిన దేశంలోనే తొలి థీమాటిక్ 'సెంటర్ ఫర్ ఫోర్త్ ఇండస్ట్రియల్ రెవల్యూషన్' కార్యాచరణపై చర్చించారు. గ్రీన్ ఎనర్జీ, ఎనర్జీ ట్రాన్సిషన్, సైబర్ రెసిలియెన్స్ వంటి అంశాలపై ఈ కేంద్రం అధ్యయనం చేయనుంది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, రాష్ట్రాన్ని గ్రీన్ ఎనర్జీ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ రంగాల్లో ప్రపంచ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దాలని సూచించారు. విశాఖ డేటా సెంటర్ కారిడార్, గ్రీన్ హైడ్రోజన్ పెట్టుబడులను C4IR కార్యాచరణతో అనుసంధానం చేయాలని, ఫలితాలు సాధించేలా పనిచేయాలని ఆదేశించారు. వచ్చే దావోస్ సదస్సు నాటికి ఏపీ సాధించిన పురోగతిని ప్రపంచానికి చాటిచెప్పే స్థాయికి ఎదగాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశాల్లో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పదార్థాల సరఫరా

మావోయిస్టు కేడర్ సోడి కేసకు అందజేస్తుండగా స్థానిక పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితులపై ఐపీసీ, పేలుడు పదార్థాల చట్టం, చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ) కింద కేసులు నమోదు చేశారు. స్థానిక పోలీసుల నుంచి 2024 సెప్టెంబర్‌లో ఈ కేసును స్వీకరించిన ఎన్ఐఏ, దర్యాప్తులో కీలక విషయాలు కనుగొంది. భద్రతా బలగాలపై దాడులు చేసేందుకు నిందితులు మావోయిస్టులకు పేలుడు పదార్థాలు సేకరించి, రవాణా చేస్తున్నట్లు తేలింది. దేశ భద్రత, స్థిరత్వానికి భంగం కలిగించేలా ఈ ప్రాంతంలో మావోయిస్టు కార్యకలాపాలను బలోపేతం చేయడమే ఈ కుట్ర వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశమని ఎన్ఐఏ తన దర్యాప్తులో పేర్కొంది. ఈ కేసులో మరిన్ని సంబంధాలను గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగుతోందని ఎన్ఐఏ అధికారులు తెలిపారు.

## ఈడీ నోటీసులు

అనుకూలంగా వ్యవహరించారు. సోదాల్లో రూ.1.53లక్షల నగదు, రూ.1.30 కోట్ల విలువైన వెండి, స్థిర, చరాస్తుల పత్రాలు, 1800 డాలర్లు స్వాధీనం చేసుకున్నాం. రూ.2,407 కోట్ల ఒప్పందాలకు లెక్కలు చెప్పాలని నోటీసులు ఇచ్చాం" అని ఈడీ పేర్కొంది.

## నిరంతర తనిఖీలు చేయాలి

ఉంటుందన్నారు. నిత్యం గోదావరిలో కలిసే 13.24 మిలియన్ లీటర్ల ఆక్వా కాలుష్యం వీటికి అదనమని పేర్కొన్నారు. పారిశ్రామిక కాలుష్య నివారణకు నిరంతర తనిఖీలు చేయాలని సూచించారు. ఆర్టీజీఎస్ తరహా కంట్రోల్ రూం ద్వారా నిరంతరం ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణ టాస్క్ ఫోర్స్‌కి కంట్రోల్ రూం నిర్వహణ బాధ్యతలు అప్పగించారు.

## భూకబ్జాకు యత్నం

ముగ్గురు వ్యక్తులు నిమ్మల రాజేశ్ గౌడ్, వేణుగోపాల్, సాయి కిరణ్‌లను అరెస్టు చేసినట్లు చెప్పారు. అయితే మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, బొల్లా రమేశ్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ సర్వే నెంబర్‌లోని భూమిని క్రమబద్ధీకరించిందని తప్పుడు జీవోలు సృష్టించారని, ఇవి సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయని అన్నారు. దీంతో అప్రమత్తమైన తహసీల్దారు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. చట్టబద్ధమైన హక్కులు లేకుండానే భూమిని విక్రయించాలని కుట్ర చేసినట్లు విచారణలో వెల్లడైనట్లు డీసీపీ తెలిపారు. ఎకరా భూమిని రూ.3.5 కోట్లకు విక్రయించాలని నిర్ణయించుకున్నారని అన్నారు. కోర్టు ఆదేశాలతో నిందితుల ఇళ్లలో సోదాలు నిర్వహించి బ్యాంకు పాస్ పుస్తకాలు, మొబైల్, ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ భూమికి సంబంధించి ఇప్పటికే డబ్బులు చేతులు మారినట్లు గుర్తించామని డీసీపీ శ్రీనివాస్ తెలిపారు.

## డంపింగ్ యార్డులు లేకుండా చేస్తాం

చేస్తున్నట్టు తెలిపారు. చెత్తను బయోగ్యాస్, కంపోస్ట్ గా మారుస్తామని చెప్పారు. గత ప్రభుత్వం ప్రజల నుంచి చెత్త పన్ను వసూలు చేసిందని... అయినా 150 లక్షల చెత్తను వదిలిపోయిందని నారాయణ విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం వదిలేసిన చెత్తను తాము తొలగిస్తున్నామని చెప్పారు. మున్సిపాలిటీల చెత్తను స్వచ్ఛమైన శక్తిగా మార్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. వ్యర్థాల నుంచి కూడా సంపద సృష్టించడం కూటమి ప్రభుత్వ విధానమని చెప్పారు.

## రాహుల్ గాంధీతో షర్మిల భేటీ

చేయడానికి, రాజ్యసభలో కాంగ్రెస్ తరపున ఏపీ గొంతును వినిపించడానికి తనకు రాజ్యసభ సీటును ఇవ్వాలని ఆమె కోరుతున్నారని తెలుస్తోంది. రాహుల్ గాంధీతో భేటీ అనంతరం షర్మిల కారులో వెళుతుండగా మీడియా పలకరించింది. ఈ సమావేశంలో ఎప్పటిలా సాధారణ సమీక్ష జరిగిందని ఆమె పేర్కొన్నారు. ఏపీ తాజా రాజకీయ పరిణామాలపై చర్చించినట్లు చెప్పారు. రాహుల్ గాంధీతో భేటీలో షర్మిలతో పాటు ఆమె భర్త అనిల్ కుమార్ కూడా పాల్గొన్నారు.

## ఢీ కొట్టి హత్య : సీపీ సజ్జనర్

ఢీకొట్టి హత్య చేశారు. వాహనానికి నంబర్ ప్లేట్లు లేకుండా వచ్చి ఢీకొట్టారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించాం. ప్రత్యేక బృందాలతో వారిని అదుపులోకి తీసుకున్నాం. వక్ఫ్ ఆస్తులు, ట్రిబ్యునల్ కేసుల వివాదాలే హత్యకు ప్రధాన కారణంగా విచారణలో వెల్లడైంది. ప్రధాన కుట్రదారుడు ముజాహిద్ ఆలంఖాన్‌ను అరెస్ట్ చేశాం. మొహిజుద్దీన్ హత్య కోసం రూ.15 లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. హరియాణాలోని పానిపట్‌లో కిషన్ అలియాస్ పప్పును అదుపులోకి తీసుకున్నాం. జనవరి నుంచి న్యాయవాది కదలికలపై నిందితులు రెక్కీ నిర్వహించారు. హత్య కోసం ప్రత్యేకంగా స్కార్పియో వాహనం కొనుగోలు చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. డ్రైవర్ అభిజిత్ అలియాస్ నాని వాహనం నడిపి హత్య చేసినట్లు గుర్తించాం. నిందితుల నుంచి రూ.10.10 లక్షల నగదు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నాం. హత్యకు ఉపయోగించిన స్కార్పియో వాహనాన్ని సీజ్ చేశాం. నిందితుల్లో మరికొంతమంది పరారీలో ఉన్నారు.. వారి కోసం గాలింపు కొనసాగుతోంది" అని సజ్జనర్ వివరించారు.

## సంపూర్ణ అవగాహనతో ఉండాలి

ఇన్‌ఛార్జ్‌లను నియమించాలి. వారు సరిగా పనిచేస్తే ఒక్క ఓటు కూడా తొలగించకుండా చూడొచ్చు. క్షేత్రస్థాయిలో కార్యకర్తలను 10 రోజులకోసారి కలుస్తాను. నెలలో 3 రోజులు కార్యకర్తల కోసం సమయం కేటాయిస్తా. నాతో సహా అందరూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాల్సిందే. బూత్ ఎన్‌రోలర్ల సాయంతో 90 రోజుల్లో 45 లక్షల డిజిటల్ సభ్యత్వాలు చేయించాం. ఎక్కువ సభ్యత్వాలు చేయించిన వారికి రాహుల్‌గాంధీతో సన్మానం చేయించాం"అని రేవంత్ అన్నారు.

## వైట్‌హౌస్ వెబ్‌సైట్


ప్రభుత్వం ఓ రహస్యాన్ని అత్యంత గోప్యంగా ఉంచుతోంది. ఏలియన్స్ మనమధ్యే నివసిస్తూ నిత్యం మనతోనే కలిసి నడుస్తున్నారు. కానీ, వాళ్లు ఇక్కడివారు కాదు. లక్షలాది మంది గుట్టుగా వచ్చి మన సమాజంలో కలిసిపోయారు. అసలేం జరుగుతోందో అనేక మంది అధ్యక్షులు, చట్టసభ సభ్యులు, ఉన్నతాధికారులకు తెలుసు. అమెరికా పౌరులను రక్షించేందుకు బదులు.. అక్రమ ప్రవేశాలను చూసి చూడనట్లు వదిలేశారు. అక్రమ వలసల వల్ల అమెరికన్లకు పొంచి ఉన్న ప్రమాదాన్ని అధ్యక్షుడు ట్రంప్ నిర్భయంగా ఎత్తిచూపారు. అటువంటి వారి వివరాలు తెలియజేస్తే.. సురక్షితంగా స్వదేశాలకు పంపిస్తాం" అని కొత్త వెబ్‌పేజీలో వైట్‌హౌస్ పేర్కొంది.

## తితిదే కీలక నిర్ణయం

దర్శన టికెట్లను తిరుపతి విమానాశ్రయంలో కరెంట్ బుకింగ్ కింద జారీ చేస్తోంది. ప్రస్తుతం రోజువారీ కరెంట్ బుకింగ్ కోటాలో అందుబాటులో ఉన్న 800 దర్శన టికెట్లలో ఇప్పటికే రూ.10 వేలు విరాళం చెల్లించి దర్శన టికెట్ కోసం వేచి ఉన్న దాతలకు ప్రతిరోజూ 300 టికెట్లు ప్రత్యేకంగా కేటాయించాలని నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఈ సదుపాయం 2025 మే 1 నుంచి విరాళం చెల్లించిన అర్హులైన దాతలకు వర్తించనుందని తితిదే తెలిపింది. ఈ టికెట్లు ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు విడుదల చేస్తారని.. మధ్యాహ్నం 1 గంటలోపు బుక్ చేసుకున్న భక్తులకు అదే రోజు సాయంత్రం 4 గంటలకు దర్శనానికి అనుమతించనున్నట్లు పేర్కొంది. కాగా ఈ విధానం జూన్ 10 నుంచి అమలులోకి రానుంది. ఈ కోటాలో బుకింగ్ కాని టికెట్లను తిరిగి కరెంట్ బుకింగ్ కోటాలో ఇస్తామని పేర్కొంది. ఈ విధానం 2027 మార్చి 31 వరకు అమల్లో ఉంటుందని తితిదే వెల్లడించింది.

# దేవాన్ష్ కళ్లజోడు తీసేస్తే..

### మహానాడులో ఆసక్తికర చర్చ!



టీడీపీ 44వ మహానాడు ఉత్సాహంగా కొనసాగుతోంది. పార్టీ కేంద్ర కార్యాలయంలో హైబ్రిడ్ విధానంలో నిర్వహిస్తున్న మహానాడులో అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేశ్ తోపాటు పలువురు మంత్రులు, సీనియర్ నాయకులు, పార్టీ ప్రతినిధులు ఒక్కొక్కరుగా ప్రసంగిస్తున్నారు. యువత, మహిళలు, ఎస్సీ, ఎస్టీల సంక్షేమంపై పలు తీర్మానాలు ప్రవేశపెడుతున్నారు. ఈ క్రమంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మోకా ఆనంద సాగర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టిన రోజున యువనాడు అనే కార్యక్రమం ప్రారంభించాలనే ప్రతిపాదనతోపాటు, మంత్రి లోకేశ్ కుమారుడు దేవాన్ష్ అందచందాలపైనా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మహానాడు వేదికపై పార్టీ అధికార ప్రతినిధి మోకా ఆనందసాగర్ చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. తీవ్రమైన భావోద్వేగంతో మాట్లాడిన ఆనంద సాగర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ అందం నందమూరి-నారా కుటుంబంలో ఒక్కరికే వచ్చిందని వ్యాఖ్యానించారు. మంత్రి లోకేశ్ కుమారుడు నారా దేవాన్ష్ అచ్చంగా సీనియర్ ఎన్టీఆర్ రూపంలో కనిపిస్తున్నారని, దేవాన్ష్ కళ్ల జోడు పెట్టుకుంటున్నారని, అది తీసేస్తే సీనియర్ ఎన్టీఆర్ మాదిరిగానే కనిపిస్తారని చెప్పారు. మహానాడు వేదికపై ఆనందసాగర్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఎవరూ ఊహించని విధంగా ఆయన దేవాన్ష్ ను కీర్తించడంతో పార్టీ నేతలు సైతం అవాక్కయ్యారని చెబుతున్నారు.

**'మహానాడు' తరహాలోనే 'యువనాడు'**

ఇక ఆనందసాగర్ ముఖ్యమంత్రి చంద్రబాబును ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. టీడీపీ ప్రతి ఏటా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 'మహానాడు' తరహాలోనే, అధినేత చంద్రబాబు పుట్టినరోజును కూడా ఒక పెద్ద పండుగలా నిర్వహించాలని ప్రతిపాదించారు. చంద్రబాబు జన్మదిన వేడుకలలో కేవలం కేక్ కటింగ్స్, అన్నదానం వంటి కార్యక్రమాలకే పరిమితం చేయకుండా.. పార్టీ శ్రేణులంతా కలిసి ఒక ఉత్సవంలా జరుపుకోవాలని సూచించారు. ఈ వేడుకలకు 'చంద్రనాడు' లేదా 'యువనాడు' అని పేరు పెట్టాలని ఆయన సరికొత్త ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు.

**నెట్టింట వైరల్ అవుతున్న వ్యాఖ్యలు**

నారా దేవాన్ష్‌ను నేరుగా లెజెండరీ యాక్టర్ ఎన్టీఆర్‌తో పోల్చడం, అలాగే చంద్రబాబు బర్త్‌డేను 'చంద్రనాడు'గా సెలబ్రేట్ చేయాలనడంపై నెట్టింట ఆసక్తికర చర్చ జరుగుతోంది. టీడీపీ శ్రేణులు ఈ వ్యాఖ్యలను సమర్థిస్తూ సోషల్ మీడియాలో షేర్ చేస్తుండగా.. ప్రత్యర్థి పార్టీల నేతలు, నెటిజన్లు మాత్రం ఇది కాస్త అతిశయోక్తిగా ఉందంటూ కామెంట్లు పెడుతున్నారని చెబుతున్నారు. ఏది ఏమైనా, ప్రస్తుతం మోకా ఆనంద సాగర్ చేసిన వ్యాఖ్యలు మాత్రం పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్ అవుతున్నాయి.

# షర్మిలకు రాజ్యసభ సీటు గ్యారంటీ..?



ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు, వైసీపీ అధినేత జగన్ సోదరి అయిన వైఎస్ షర్మిలకు గుడ్ న్యూస్ ని కాంగ్రెస్ హైకమాండ్ చెప్పబోతోంది అని అంటున్నారు. ఆమెకు పెద్దల సభలో అవకాశం దక్కబోతోంది అని కాంగ్రెస్ సర్కిల్స్ లో ప్రచారం సాగుతోంది. ట్రబుల్ షూటర్ గా పేరు గడించిన డీకే శివ కుమార్ కర్ణాటకకు కొత్త చీఫ్ మినిస్టర్ కాబోతున్నారు. ఆయనే గతంలో షర్మిలను కాంగ్రెస్ లోకి తీసుకుని రావడంలో ఆమె పార్టీని విలీనం చేయించడంలో కీలకమైన పాత్ర పోషించారు. వైఎస్సార్ కుటుంబం తో డీకేకు ఉన్న పరిచయాలతో ఈ విధంగా ఆయన ఏపీలో కాంగ్రెస్ బలోపేతానికి తన వంతుగా స్టెప్ తీసుకున్నారు అని అంటున్నారు.

**నాటి హామీతోనే :** ఆ సమయంలో షర్మిలకు కాంగ్రెస్ అగ్ర నాయకత్వం నేరుగా ఒక హామీ ఇచ్చింది అని చెబుతున్నారు. ఆమెకు రాజ్యసభ సీటు ఇస్తామని ఆ హామీ సారాంశం. అందుకే షర్మిల కాంగ్రెస్ లో చేరారు అని అంటున్నారు. ఇక 2024 లో రాజ్యసభ ఎన్నికలు జరిగాయి. ఆనాడు కూడా షర్మిల పేరు వినిపించింది కానీ ఆమెకు చాన్స్ దక్కలేదు. ఇక ఈసారి కూడా కర్ణాటక నుంచి మూడు ఎంపీ సీట్లు రాజ్యసభకు ఖాళీ అవుతున్నాయి. ఇందులో ఒక దానికి షర్మిలకు ఇస్తారు అని అంటున్నారు. కాంగ్రెస్ పార్టీలో కీలకమైన నేతగా దక్షిణాదిన పార్టీ వ్యవహారాలు చూసే డీకే ముఖ్యమంత్రి కావడం షర్మిలకు కలిసి వచ్చే అంశం అని అంటున్నారు. అందుకే నాటి హామీ నేడు నెరవేరబోతోంది అని అంటున్నారు.

**వైసీపీని వీక్ చేయడమే :** షర్మిలకు పీసీసీ చీఫ్ పదవి దక్కదని ఆమె పట్ల అధినాయకత్వం అంత సుముఖంగా లేరని వస్తున్న వార్తలు అన్నీ ఉత్తవే అని అంటున్నారు. షర్మిల వైసీపీని జగన్ ని టార్గెట్ చేసుకుని విమర్శించడం వెనక కాంగ్రెస్ పెద్దల వ్యూహం కూడా ఉందని చెబుతున్నారు. పోయిన చోటనే వెతుక్కోవాలని రాజకీయ నీతి. అందుకే వైసీపీని విమర్శిస్తేనే అక్కడకు చేరిన కాంగ్రెస్ ఓటు బ్యాంక్ ఎంతో కొంత వెనక్కి వస్తుందని ఆశతోనే కాంగ్రెస్ పెద్దలు షర్మిలకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చారని అంటున్నారు. ఇపుడు రాజ్యసభ సీటు ఇచ్చి ఆమెని మరింతగా బలోపేతం చేయడం ద్వారా వైసీపీని ఇంకా వీక్ చేయడానికి చూస్తారు అని అంటున్నారు.

**ఏపీ మీదనే ఫోకస్ :** ఈ రోజున దక్షిణాది అంతా కాంగ్రెస్ ఉందని ఏపీలో మాత్రం పెద్దగా లేదని కాంగ్రెస్ ఢిల్లీ నేతలు భావిస్తున్నారు దాంతో రానున్న రోజులలో ఏపీ మీద ఫోకస్ పెంచుతారు అని అంటున్నారు. ఇక రాజ్యసభ మెంబర్ గా షర్మిలను చేయడం ద్వారా ఆమె వాయిస్ మరింతగా పెంచి ఒక చట్ట సభ సభ్యురాలిగా ఆమె ఇమేజ్ ని కూడా పెంచడం ద్వారా ఏపీలో కాంగ్రెస్ గొంతుని ఇంకా పెద్దదిగా చేయాలన్న వ్యూహ రచన ఉంది అని అంటున్నారు. రానున్న రోజులన కాంగ్రెస్ పెద్దలు కూడా ఏపీలో పర్యటిస్తారు అని అంటున్నారు. ఇక డీకేకి కూడా ఈ బాధ్యతలు అప్పగిస్తారు అని చెబుతున్నారు. మొత్తం మీద షర్మిలకు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న రాజ్యసభ సీటు దక్కే చాన్స్ ఉందని తొందరలోనే ఆమె శుభ వార్తను వింటారని అంటున్నారు. చూడాలి మరి ఈ ప్రచారంలో నిజమెంత వరకు ఉందో.

# తెలంగాణలో ఉండాలంటే వీసా కావాలా?..

### సీఎం రేవంత్‌కు ఏపీ బీజేపీ నేత సూటి ప్రశ్న



**విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రొఫెసర్ నాగేశ్వర్‌కు సంబంధించిన వివాదం తెలుగు రాష్ట్రాల మధ్య రాజకీయ దుమారం రేపుతోంది. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేల్ చేసిన వ్యాఖ్యలకు ఏపీ బీజేపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి గట్టిగా బదులిచ్చారు. "తెలంగాణలో బతకాలంటే ప్రత్యేక పాస్‌పోర్ట్, వీసా ఏమైనా కావాలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు?" అంటూ ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందించారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లను ఉద్దేశించి 'వెంటనే జూబ్లీహిల్స్ వదిలి వెళ్లిపోవాలి' అంటూ బెదిరింపులకు దిగిన కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేల్‌పై సుమోటోగా కేసు నమోదు చేయాలని తెలంగాణ డీజీపీని విష్ణువర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఒక ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తులకే ఇలాంటి బహిరంగ బెదిరింపులు వస్తే, ఇక తెలంగాణలో సామాన్యుల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఐదు కోట్ల మంది ఆంధ్రులను అవమానించడమేనని అన్నారు. తెలంగాణ ప్రజలు అందరినీ ప్రేమించే వారని, కానీ కొందరు రాజకీయాల కోసం రాష్ట్రాన్ని నాశనం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**వివాదానికి నేపథ్యం ఇదే..**

మూడు రోజుల క్రితం ప్రొఫెసర్ నాగేశ్వర్‌ను అరెస్ట్ చేసేందుకు ఏపీ పోలీసులు హైదరాబాద్ వచ్చారంటూ ప్రచారం జరిగింది. దీనిపై కొందరు జర్నలిస్టులతో కలిసి తుంగతుర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేల్ స్పందించారు. చంద్రబాబు, పవన్‌లకు హైదరాబాద్‌లో ఏం పని అని ప్రశ్నించారు. తెలంగాణ మేధావులపై అరాచకాలు సాగవని హెచ్చరించారు. బతకడానికి తెలంగాణకు వచ్చిన వారు పద్ధతిగా ఉండాలని, పెత్తనం చెలాయిస్తామంటే ఊరుకునేది లేదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 60 ఏళ్లు పోరాడి సాధించుకున్న తెలంగాణలో మళ్లీ ఆంధ్రా నేతలకు వ్యతిరేకంగా పోరాటం వస్తుందని ఆయన హెచ్చరించడంతో ఈ వివాదం ముదిరింది.

# ఎడిటర్ వాయిస్

## వచ్చేన్ జూన్.. అన్ని రేట్లూ పెంచేస్ సీజన్!

మే నెలలో సామాన్యుడి జేబుకు చిల్లు పడింది. పెట్రోల్ ఏకంగా నాలుగు సార్లు పెంచారు. ఆ విధంగా లీటర్ మీద ఎనిమిది రూపాయలు పైగా ఎక్కువ చేశారు. డీజిల్ పెట్రోల్ మీద పెరిగిన ధరలు అక్కడితో ఆగవు. నిత్యావసరాల మీద కూరగాయలు కిరాణా మీద కూడా పడతాయి. ఇపుడు మెల్లగా ఆ ప్రభావం అంతా జూన్ నెలలో కనిపిస్తుంది అని అంటున్నారు. ఇప్పటికే ఎల్పీజీ గ్యాస్ మీద 50 రూపాయలు పెంచేశారు. జూన్ లో కూడా మరోసారి పెంపుదల ఉంటుందని అంటున్నారు. ఇంకా అనేక రకాలుగా ధరలు పెరిగి జూన్ కొంప ముంచే సీజన్ అయ్యేలా ఉందని అంటున్నారు.

**గల్ఫ్ యుద్ధం నేపథ్యంలో :** గత నాలుగు నెలలుగా సాగుతున్న గల్ఫ్ ప్రత్యక్ష పరోక్ష యుద్ధం ప్రభావం భారత్ కి మే నెల మధ్య నాటికి కానీ తెలిసింది కాదు. దానికి కారణం దేశంలో అయిదు రాష్ట్రాలకు సార్వత్రిక ఎన్నికలు జరగడం. ఆ ఎన్నికలు పూర్తి అయి ఫలితాలు వచ్చి కొత్త ప్రభుత్వాలు కొలువు తీరాక అపుడు తాపీగా జనం మీద ఈ భారాలు మోపారు. అయితే ఇది కేవలం ఆరంభం మాత్రమే అని అంటున్నారు. ఇప్పటికి నాలుగు సార్లు పెరిగినా కూడా పెట్రోల్ మీద పెంపుతో చమురు కంపీనలకు నష్టాలు ఇంకా పూడ్చడంలేదని అంటున్నారు. దాంతో మరో 20 రూపాయల దాకా పెంచుకుంటూ పోతేనే తప్ప కుదిరే వ్యవహారంగా కనిపించడం లేదని అంటున్నారు. అంటే జూన్ లో కూడా విడతల వారీగా పెట్రో ధరలు పెరిగి సగటు జీవితాల మీద పెను ప్రభావం పడడం ఖాయంగా కనిపిస్తోంది అని అంటున్నారు.

**ఎల్పీజీ గ్యాస్ సైతం :** ఇక రెండవ విడతగా ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధరలు పెరుగుతాయని అంటున్నారు. పెంచిన యాభై రూపాయలతోనే భారం తట్టుకోలేమని భావిస్తున్న మధ్యతరగతి పేద వర్గాలకు ఇది గుదిబండగానే మారుతుందని అంటున్నారు. దాంతో జూన్ నెల వస్తూనే గ్యాస్ బండ మంట పెట్టడం ఖాయమని ఫిక్స్ కావాల్సిందే అని అంటున్నారు. దాంతో వంటింటి బడ్జెట్ మొత్తం పూర్తిగా తల్లకిందులు అవుతుందని కూడా అంటున్నారు. ఈ పెరుగుదలతో పాతు యూపీయే పేమెంట్లకు సంబంధించి కొత్త నిబంధనలు తీసుకుని వస్తారు అని అంటున్నారు అలాగే పాన్ కార్డు విషయంలో కూడా కొత్త నిబంధనలు అలాగే ఏటీఎం చార్జీల పెరుగుదల వంటివి ఉండబోతున్నాయని అంటున్నారు.

**సగటు జీవి టార్గెట్ :** మరి ఏటీఎంల నుంచి నగదుని ఉచితంగా తీసుకునే పరిమితిని తగ్గించేందుకు కూడా కొన్ని బ్యాంకులు సవరణలు చేయవచ్చు అని అంటున్నారు. అదే జరిగితే సామాన్యుడికే ఇబ్బంది అని అంటున్నారు. ఇలా చూస్తూ పోతే జూన్ నెలలో మరిన్ని ఆర్థికపరమైన అంశాలతో చేయబోతున్న నిర్ణయాలు నేరుగా సగటు జీవినే టార్గెట్ చేయనున్నాయని అంటున్నారు. మరి ఇప్పటికే పెట్రోల్ పెరిగింది ఇంకా పెంచుతారా అంటే తప్పదు అన్న మాటలు వినవస్తున్నాయి. అలాగే ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల విషయంలో అదే ఆన్సర్ వస్తోంది. ఇలా పెరిగిన వాటితో ఆహార ద్రవ్యోల్బణం కూడా పెరిగిపోతుందని ఫలితంగా సగటు జీవి కష్టాలు ఇంకా పెరుగుతాయని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైం వాయిస్

### నలుగురిని చంపి.. మృతదేహాలు కాల్చేసి..

## ఆపై గుండెలు బాదుకుంటూ..



**విశ్వం వాయిస్ న్యూస్ :** నలుగురి ప్రాణాలు తీసి.. ప్రమాదంగా చిత్రీకరించింది. ఆపై ఏమీ తెలియదన్నట్లు అంత్యక్రియల్లో గుండెలు బాదుకుంటూ బోరున విలపించింది. చివరికి ఆమె కపట నాటకం బయటపడి.. కటకటాలపాలైంది. అసలేం జరిగిందంటే.. రాజస్థాన్‌లోని అజ్మేర్ సమీపంలోని హైవేపై గురువారం ఘోర ప్రమాదం జరిగింది. ఓ కారులో మంటలు చెలరేగడంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. సమీపంలోని పొలాల్లో కత్తి గాట్లతో మరో మృతదేహం పడి ఉంది. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మృతులు మాజీ సర్పంచ్ రామ్ సింగ్ చౌదరి, ఆయన తల్లి, ఆయన రెండో భార్య, మేనకోడలుగా గుర్తించారు. దర్యాప్తు క్రమంలో నివ్వెరపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. మాజీ సర్పంచ్ మొదటి భార్య సునీతనే ఈ హత్యలకు పాల్పడినట్లు పోలీసులు కనుగొన్నారు.

**కుమార్తె, మైనర్ కుమారుడితో కలిసి హత్యలు..**

రామ్ సింగ్, సునీతకు 2005లో వివాహం జరగ్గా.. ఇద్దరు పిల్లలు. సునీతకు ఇష్టం లేకుండా రామ్‌సింగ్ మరో మహిళను పెళ్లి చేసుకున్నాడు. ఈ విషయంపై వీరి మధ్య నిత్యం గొడవలు జరిగేవి. బుధవారం కూడా వీరి మధ్య పెద్ద వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో కుమార్తె సరిత, మైనర్ కుమారుడితో కలిసి రామ్‌సింగ్‌ను హత్య చేసేందుకు సునీత ప్లాన్ వేసింది. ఇందుకోసం ఆన్‌లైన్‌లో ముందుగానే కత్తిని కూడా కొనుగోలు చేసింది. అదే రోజు రాత్రి నిద్రిస్తున్న రామ్‌సింగ్‌పై దాడి చేసి కత్తితో పొడిచి చంపేశారు. ఆ తర్వాత మిగిలిన వారిని కూడా హత్య చేశారు. దీన్ని ప్రమాదంగా చిత్రీకరించేందుకు.. మృతదేహాలను కారులోకి ఎక్కించి ఇంటికి దూరంగా తీసుకెళ్లి నిప్పంటించారు. కాలిపోవడానికి ముందే బాధితులు చనిపోయినట్లు ఫారెన్సిక్ రిపోర్ట్‌లో తేలింది. దర్యాప్తు క్రమంలో మైనర్ బాలుడు కూడా నేరాన్ని అంగీకరించాడు. దీంతో పోలీసులు సునీత, ఆమె కుమార్తెతో పాటు ఆ బాలుడిని అరెస్టు చేశారు.

**ఏమీ తెలియనట్లు గుండెలు బాదుకుంటూ..**

ఈ కేసు దర్యాప్తు సందర్భంగా పోలీసులు బాధితుల ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో సునీత ఏమీ తెలియదనట్లు.. గుండెలు బాదుకుంటూ రోదించిందని పోలీసులు తెలిపారు. దీంతో తొలుత ఆమెపై అనుమానం రాలేదని వెల్లడించారు. అయితే, చివరకు హత్య చేసింది ఆమేనని దర్యాప్తులో తేలిందన్నారు.

## రెండోరోజు కొనసాగిన భగీరథ్ కస్టడీ

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** పోక్సో కేసులో నిందితుడు బండి భగీరథ్ పోలీసు కస్టడీ రెండోరోజు కొనసాగింది. పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అతణ్ని విచారించారు. ప్రధానంగా బాధితురాలితో ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్, స్నాప్‌చాట్‌లలో చాటింగ్‌లకు సంబంధించి కొన్ని ఆధారాలు సేకరించిన పోలీసులు.. వాటి ఆధారంగానే భగీరథ్‌ను ప్రశ్నించినట్లు తెలిసింది. పోలీసులు ఇప్పటికే బాధితురాలు, ఆమె తల్లితో పాటు.. ఫామ్‌హౌస్‌కు వెళ్లిన భగీరథ్ స్నేహితుల వాంగ్మూలాలు నమోదు చేశారు. వీటితో పాటు సీసీ కెమెరా ఫుటేజీలు, కాల్ డేటా సహా కొన్ని ఆధారాలు సేకరించారు. బాధితురాలి తల్లి అందించిన కాల్ రికార్డింగ్‌ల గురించి భగీరథ్ ముందు ప్రస్తావించినట్లు తెలిసింది. భగీరథ్ చెప్పిన సమాధానాలు రికార్డు చేసుకున్న పోలీసులు.. మరికొన్ని ప్రశ్నలు వేసినట్లు సమాచారం. కేసు దర్యాప్తు అధికారి, పేట్‌బషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌వర్ధన్ ఆధ్వర్యంలో రెండోరోజు విచారణ ఎక్కువ సమయం కొనసాగింది.

## పోలీసుల అదుపులో సుబోధ్ సింగ్?

### పీఎంజే జ్యుయలర్స్ కేసులో ప్రధాన సూత్రధారి..

**కరీంనగర్ కొత్తపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** సంచలనం సృష్టించిన కరీంనగర్ పీఎంజే జ్యుయలర్స్‌లో బంగారు, వజ్రాల ఆభరణాల దోపిడీ కేసు ప్రధాన సూత్రధారి సుబోధ్ సింగ్‌ను పీటీ వారెంట్‌పై కమిషనరేట్ పోలీసులు కరీంనగర్‌కు తీసుకొచ్చినట్లు సమాచారం. బిహార్‌లోని పూర్నియా సెంట్రల్ జైల్లో ఖైదీగా ఉన్న సుబోధ్ సింగ్‌ను కరీంనగర్ కోర్టులో హాజరుపరచనున్నారు. కోర్టు అనుమతితో అతడిని కస్టడీకి తీసుకుని దోపిడీకి సంబంధించిన మరిన్ని వివరాలు రాబట్టనున్నట్లు సమాచారం.

### రాజమహేంద్రవరంలో

## భారీ అగ్ని ప్రమాదం.. వస్త్రాలు దగ్ధం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఓ వస్త్ర దుకాణంలో శుక్రవారం ఉదయం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. విద్యుదాఘాతంతో చెలరేగిన మంటలు దుకాణంలోని రెండు అంతస్తులకు వ్యాపించాయి. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని రెండు ఫైరింజన్లతో మంటలు ఆర్పివేశారు. అప్పటి దుకాణంలోని వస్త్రాలు దగ్ధమయ్యాయి.

### న్యాయవాది మొహిజుద్దీన్ చంపేందుకు

## రూ.25లక్షల సుపారీ



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్‌లో వక్ఫ్‌బోర్డు ప్యానల్ న్యాయవాది ఖాజా మొహిజుద్దీన్(63) హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ప్రధాన నిందితులు మహబూబ్ ఆలంఖాన్, అతని కుమారుడిని అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. మొహిజుద్దీన్ హత్యకు.. నిందితులు రెండేళ్లలో 10 సార్లు యత్నించినట్టు పోలీసులు గుర్తించారు. హత్యకు రూ.25లక్షలు సుపారీ ఇచ్చినట్టు దర్యాప్తులో తేలింది. రెడ్‌హిల్స్ శాంతినగర్‌లోని మోయిజ్ రెసిడెన్సీలో నివాసం ఉండే మొహిజుద్దీన్ సిటీ సివిల్ కోర్టులో, హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. వక్ఫ్ స్థలాలను ఆక్రమించి కళాశాలలు నిర్మించారంటూ ఓ ప్రముఖ విద్యాసంస్థ నిర్వాహకులతో వక్ఫ్‌బోర్డు ప్యానల్ న్యాయవాదిగా న్యాయపోరాటం సాగిస్తున్నారు. ఈ నెల 23న ఉదయం 5.42 గంటలకు స్విమ్మింగ్‌కు వెళ్లేందుకు ఇంటి నుంచి బయటకు వచ్చారు. ఇంటి ముందు నిలిపిన కారు డోర్ తీసేందుకు సిద్ధమవుతున్న సమయంలో కొద్దిదూరంలో నిలిపి ఉన్న కారు వేగంగా వచ్చి ఆయనను ఢీకొట్టి 20 మీటర్ల దూరం లాక్కెళ్లింది. తీవ్రంగా గాయపడిన ఆయనను కుటుంబసభ్యులు ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతిచెందారు.

### అటవీశాఖ మాజీ అధికారిణి..

## ఏనుగు దంతాల స్మగ్లర్

**రూ.2 కోట్ల విలువైన సరకు స్వాధీనం - నిందితురాలు కర్నూలు వాసి**



**మైసూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** కర్ణాటక రాష్ట్రం మైసూరు పరిధిలో ఏనుగు దంతాలను తరలిస్తున్న నలుగురిని అటవీశాఖ అధికారులు గురువారం అరెస్టుచేశారు. ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ మాజీ ఉద్యోగిని జమునా రాణిది కర్నూలు. ముందస్తు పదవీ విరమణ చేశాక... భర్త వెంకటేశ్ కాకబుల్‌తో కలిసి మైసూరు రామకృష్ణనగరలో నివాసం ఉంటున్నారు. అధికారిణిగా కర్నూలు జిల్లాలో సేవలు అందించిన జమునా రాణి.. కొందరు స్మగ్లర్లతో కలిసి ఏనుగు దంతాలను విక్రయిస్తున్నారని అధికారులకు సమాచారం అందింది. దాంతో వారు దాడులు నిర్వహించారు. జమునా రాణితో పాటు కర్నూలు జిల్లాకు చెందిన సయ్యద్ ఫయాజ్, కొళ్లేగాల నివాసులు మునీర్‌పాషా, అజ్గర్‌ఖాన్‌లను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.2 కోట్ల విలువైన మూడు దంతాలను స్వాధీనం చేసుకున్నారు. మరిన్ని వివరాలను రాబట్టేందుకు నిందితులను విచారిస్తున్నారు.

## వామ్మో.. పాకిస్తాన్‌లో తులం బంగారం ఎంతో తెలుసా..?

### కొనాలంటే ఆస్తులన్నీ అమ్మేయాల్సిందే..



ప్రపంచవ్యాప్తంగా బంగారం ధరలు పెరిగిపోతున్నాయి. కొన్ని దేశాల్లో పెరుగుదల స్వల్పంగా ఉండగా.. మరికొన్ని దేశాల్లో భారీ స్థాయిలో పెరిగాయి. మన పక్క దేశమైన పాకిస్తాన్‌లో మాత్రం గోల్డ్ రేట్లు దారుణంగా ఉన్నాయి. అక్కడ గోల్డ్ రేట్లు మండిపోతున్నాయి. పాకికస్తాన్ ఆర్థికంగా సంక్షోభంలో ఉండటమే ఇందుకు కారణంగా చెప్పవచ్చు. గత కొన్నేళ్లుగా ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, ఉద్రిక్త పరిస్థితులు, ఆర్థిక ద్రవ్యోల్బణం వంటి పరిస్థితుల వల్ల బంగారంపై పెట్టుబడులు పెరుగుతున్నాయి. బంగారంలో పెట్టుబడులు పెట్టేందుకు ఎక్కువమంది ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో వాటి ధరలు రికార్డు స్థాయిలో గత రెండేళ్లుగా పెరుగుతున్నాయి. వివిధ దేశాల సెంట్రల్ బ్యాంకులు కూడా బంగారం నిల్వలను పెంచుకునేందుకు పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తున్నారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా బంగారం ధరలు పెరుగుతున్నాయి. ఎక్సైజ్ సుంకాలు, ట్యాక్సులను బట్టి దేశాల వారీగా గోల్డ్ రేట్లు మారుతూ ఉంటాయి. కొన్ని దేశాల్లో ధరలు స్వల్పంగా పెరగ్గా.. మరికొన్ని దేశాల్లో అధికంగా ఉన్నాయి. దాయాది దేశమైన పాకిస్తాన్‌లో బంగారం రేట్లు మరీ అధికంగా ఉన్నాయి. పాకిస్తాన్ ఆర్థికంగా సంక్షోభంలో కూరుకుపోగా.. ఆ దేశ కరెన్సీ విలువ కూడా పాతాళంలోకి పడిపోయింది. దీంతో పాక్‌లో బంగారం ధరలు దారుణంగా పెరిగిపోయాయి. దీంతో ఆ దేశ ప్రజలు బంగారం కొనాలంటేనే భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. పాక్‌లో 11.66 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 4,65,500 పాకిస్తాన్ రూపాయలుగా ఉంది. ఇక 22 క్యారెట్ల గోల్డ్ ధర 4,26,800 పలుకుతోంది. దీని లెక్కన 20 గ్రాముల(రెండు తులాలు) 22 క్యారెట్ల నెక్లెస్ కొనాలంటే 8.5 లక్షల పాకిస్తాన్ రూపాయలు ఖర్చు పెట్టాలి. ఇక డిజైన్, మేకింగ్, ఇతర ఛార్జీలు కలుపుకుంటే 9 లక్షలు అవుతుంది. దీంతో పాక్ ప్రజలకు బంగారం అంటేనే అది ఒక పెద్ద లగ్జరీ వస్తువుగా మారిపోయింది. పాక్ మార్కెట్లో అస్థిరత, ద్రవ్యోల్బణం పెరిగిపోవడం, దిగుమతి ఖర్చులు, ఆర్థిక వ్యవస్థ దిగజారిపోవడం దీనికి కారణాలుగా చెప్పవచ్చు. దీంతో అక్కడి సామాన్య, మధ్యతరగతి ప్రజలకు బంగారం కొనుగోలు అనేది ఒక కలగానే మిగిలిపోతుంది. అయితే పాక్‌తో పోలిస్తే భారత్‌లో బంగారం ధరలు స్వల్పంగానే పెరిగాయి. భారత్‌లో ప్రస్తుతం 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1.60 లక్షలుగా ఉంది. 22 క్యారెట్ల ధర రూ.1.45 లక్షలుగా ఉంది. 20 గ్రాముల బంగారంతో ఒక హారం తయారికి రూ.3 లక్షల వరకు అవుతుంది. మేకింగ్ ఛార్జీలు, తరుగు అన్నీ కలుపుతున్నా రూ.3.5 లక్షలకు ఒక హారం వస్తుంది. అదే పాకిస్తాన్‌లో అయితే రూ.9 లక్షలు అవుతుంది. పాక్‌తో పోలిస్తే భారత్‌లో గోల్డ్ రేట్లు తక్కువగా ఉన్నాయని చెప్పడానికి ఇదే ఒక ఉదాహరణ. అటు భారత్‌లో వెండి ధరలు రూ.2.80 లక్షల వద్ద కొనసాగుతున్నాయి.

## పెట్రోల్ బంకుల్లో కొత్త మార్పులు..

### ఆ ఇంధనం కూడా అందుబాటులోకి.. కేంద్రం డెసిషన్




ఇంధన సరఫరాలో కీలక మార్పులకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అదేంటంటే.. ఇథనాల్ కలిపి పెట్రోల్‌ను పెట్రోల్ బంకుల్లో అందుబాటులోకి తీసుకురానుంది. దీంతో తమ వాహన రకానికి చెందిన దానిని వాహనదారులు సులువుగా గుర్తించే ప్రణాళికలు రచిస్తోంది. పెట్రోల్ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. ఇంధన దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు, దేశంలో ఇంధన నిల్వలను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్ పంపుల్లో కొత్త పెట్రోలియం ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురానుంది. పెట్రోల్ బంకుల్లో ఇథనాల్ మిశ్రమ పెట్రోల్‌ను ప్రవేశపెట్టనుంది. వాహనం రకాన్ని బట్టి వివిధ రకాల ఇథనాల్ మిశ్రమ పెట్రోల్ బ్రాండ్లను తీసుకానుంది. ఈ20, ఈ22, ఈ25, ఈ30 వంటి అనేక ఇథనాల్ మిశ్రమ పెట్రోల్ బ్రాండ్‌లను తీసుకురావాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. ముడి చమురు దిగుమతులకు సంబంధించి ఇతర దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించడం, స్వచ్ఛమైన ఇంధనాన్ని ప్రోత్సహించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ప్రభుత్వ రంగ చమురు సంస్థలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియంలతో పాటు ప్రైవేట్ కంపెనీలైన జియో-బిపి, నయారా ఎనర్జీ, షెల్ కంపెనీలు అవసరమైన మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలని అధికారులకు కేంద్రం ఆదేశాలు కూడా జారీ చేసింది.

**పెట్రోల్ బంకుల వద్ద ప్రత్యేక లేబుల్**


ఇథనాల్ కలిపిన పెట్రోల్‌ను గుర్తించేందుకు పెట్రోల్ బంకుల వద్ద ప్రత్యేక లేబుల్ ఇస్తారు. అలాగే ఇంధనానికి కలిపిన ఇథనాల్ పరిమాణాన్ని డిస్పెన్సర్ స్పష్టంగా సూచిస్తుంది. దీంతో వినియోగదారులు తమ వాహనానికి అవసరమైన సరైన రకాన్ని ఎంచుకోవచ్చు. ప్రస్తుతం దేశంలోని చాలా పెట్రోల్ పంపులలో ఈ20 పెట్రోల్ అందుబాటులో ఉన్న విషయం తెలిసిందే. దేశంలో ఇథనాల్ ఉత్పత్తి ఇప్పుడు ఎక్కువగా ఉంది. భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద చమురు వినియోగదారుగా ఉండగా.. అధిక భాగాన్ని విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంది. పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, ముడి చమురు ధరల పెరుగుదల క్రమంలో ఇథనాల్‌ను ప్రత్యామ్నాయ మార్గంగా ప్రభుత్వం భావిస్తోంది. ఇథనాల్ కార్బన్ ఉద్గారాలను కూడా గణనీయంగా తగ్గించింది. ఇక మైలేజ్, ఇంజిన్ విషయానికొస్తే.. అధిక ఇథనాల్ శాతం ఉన్న పెట్రోల్ వాడితే మైలేజ్, ఇంజిన్ పనితీరు నెమ్మదిస్తుందనే ఆందోళనలు ఉన్నాయి. అయినప్పటికీ ఈ20 వంటి ఇంధనాలు వాహనం పికప్‌ను మెరుగుపరుస్తాయని, మైలేజ్‌పై పెద్దగా ప్రభావం చూపవని ప్రభుత్వం చెబుతోంది. బ్రెజిల్‌లో మాదిరిగా భవిష్యత్తులో భారతదేశంలోని వినియోగదారులు తమ అవసరాలకు తగినట్లుగా వివిధ ఇథనాల్ మిశ్రమాలతో కూడిన పెట్రోల్‌ను ఎంచుకోవాలని నిపుణులు చెబుతున్నారు.

**తగ్గనున్న దిగుమతులు**

పెట్రోల్‌పై ఆధారపటాన్ని తగ్గించడం వల్ల దిగుమతి చేసుకోవడం తగ్గుతుంది. దీని వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా లాభం జరుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా యుద్ధ పరిస్థితుల క్రమంలో ఎలాంటి ఇబ్బందులు కర్షీడా ఉండవు. ముడి చమురు ధరలు పెరిగినా భారత్‌పై దాని ప్రభావం తక్కువగా ఉంటుంది. దీంతో పెట్రోల్, డీజిల్‌కు ప్రత్యామ్నాయ మార్గాల కోసం ప్రభుత్వం అన్వేషిస్తోంది.

# విశ్వ వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి

డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

శనివారం, 30 మే, 2026




www.viswamvoice.com

# పవన్ సూపర్ స్పీడ్.. గోదావరి ప్రక్షాళనకు హైటెక్ ప్లాన్



ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచనలతో యంత్రాంగం ఆఘమేఘాలపై రంగంలోకి దిగిందని చెబుతున్నారు. పవిత్ర గోదావరి ప్రక్షాళనకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రంగంలోకి దిగారు. వచ్చే ఏడాది పుష్కరాలు నిర్వహిస్తున్నందున ఏర్పాట్ల పర్యవేక్షణ కోసం ఇటీవల పవన్ రాజమండ్రిలో పర్యటించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో క్షేత్రస్థాయిలో పర్యటించగా, గోదావరిలో పెద్ద ఎత్తున కలుషిత జలాలు కలుస్తున్న విషయం వెలుగుచూసింది. కాలుష్య కాషారంగా మారిన నదిలో భక్తులతో స్నానం చేయించడమంటే అంతకంటే పాపం మరొకటి లేదని భావించిన పవన్ కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తక్షణం వంద కోట్లతో నదిలో కలుషిత జలాలు కలవకుండా అడ్డుకట్ట వేయాలని నిర్ణయించారు. అంతేకాకుండా పారిశ్రామిక కాలుష్య నివారణకు నిరంతర తనిఖీ చేయాలని ఆదేశించారు. ఇందుకోసం ఆర్టీజీఎస్ తరహా కంట్రోల్ రూం ద్వారా నిరంతర ప్రత్యక్ష పర్యవేక్షణకు ఏర్పాట్లు చేయాలని యంత్రాంగానికి సూచించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచనలతో యంత్రాంగం ఆఘమేఘాలపై రంగంలోకి దిగిందని చెబుతున్నారు. గోదావరి ప్రవహించే ఆరు జిల్లాల పరిధిలో కలుషిత జలాలకు అడ్డుకట్ట వేసే యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారని అంటున్నారు. కాలుష్యం ఎక్కడ నుంచి ఏ రూపంలో కలుస్తుంది గుర్తించి వాటి నివారణకు ప్రణాళికలు రూపొందించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మురుగునీటితోపాటు పారిశ్రామిక జలాలు, ఆక్వా కాలుష్యాన్ని వర్గీకరించి వాటి శుద్ధికి చర్యలు తీసుకోనున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇందుకోసం 'స్వచ్ఛ గోదావరి -- పవిత్ర పుష్కరాలు' కార్యాచరణ ప్రణాళికను ప్రకటించారు. నదిలోకి ఒక్క చుక్క మురుగు నీరు కూడా చేరకుండా నిలువరించడమే ధ్యేయంగా అధికారులకు డిప్యూటీ సీఎం అత్యంత కీలకమైన ఆదేశాలు జారీ చేశారు. డిప్యూటీ సీఎం సూచనలతో కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారులు గోదావరి పరివాహ ప్రాంతంలో క్షేత్రస్థాయి సర్వే నిర్వహించి నదిలో కలుషిత జలాలపై లెక్కలు సేకరించారు. కాలుష్యంతో గోదావరి నది ప్రస్తుతం ప్రమాదకర స్థితికి చేరుకున్నట్లు గుర్తించినట్లు చెబుతున్నారు. ఆరు జిల్లాల పరిధిలోని పట్టణాల నుంచి రోజుకు 104 మిలియన్ లీటర్ల మురుగునీరు నదిలో కలుస్తోందని, అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతి రోజూ 8.38 మిలియన్ లీటర్ల మురుగు నీరు చేరుతోందని గుర్తించారు. పారిశ్రామిక వ్యర్థాల్లో ఒక్క 'ఆంధ్ర పేపర్స్' వెదజల్లే రోజువారీ కాలుష్యమే ఏకంగా 32 మిలియన్ లీటర్లుగా ఉందని చెబుతున్నారు. కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి నిత్యం విడుదలయ్యే 13.24 మిలియన్ లీటర్ల ఆక్వా కాలుష్యం వీటికి అదనమని పీసీబీ అధికారులు తేల్చారు. ఈ విషయంపై డిప్యూటీ సీఎం పవన్ కు నివేదిక సమర్పించగా, ఆయన పక్కా ప్రణాళిక విడుదల చేసి కాలుష్యానికి చెక్ చెప్పాలని నిర్దేశించినట్లు చెబుతున్నారు.

### పల్లెల్లో మ్యాజిక్ డ్రెయిన్లు

గోదావరి పరివాహక ప్రాంతంలో గ్రామీణ ప్రాంతాల నుంచి భారీగా మురుగునీరు నదిలో కలుస్తున్నట్లు అధికారులు గుర్తించడంతో ఇకపై ఆ మురుగు గోదావరిలో చేరకుండా మ్యాజిక్ డ్రెయిన్లతో చెక్ చెప్పాలని డిప్యూటీ సీఎం ఆదేశించినట్లు సమాచారం. మొత్తం 6 జిల్లాల పరిధిలో 262 పంచాయతీలు గోదావరిని ఆనుకుని ఉన్నాయి. వీటిని పుష్కర పంచాయతీలుగా గుర్తించి వంద శాతం మురుగురహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. అదేవిధంగా గృహ వినియోగ మురుగు నీటి నియంత్రణకు సామాజిక ఇంకుడు గుంతలు నిర్మించాలని సూచించారు. ఈ పనుల కోసం పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకి మంజూరు చేసిన రూ. 100 కోట్లను వినియోగించాలని స్పష్టం చేశారు.

### పట్టణాల్లో మురుగు శుద్ధి ప్లాంట్లు

అదేవిధంగా గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్న పట్టణాలు, నగరాల నుంచి కూడా భారీ ఎత్తున కాలుష్యం నదిలో కలుస్తోందని చెబుతున్నారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్ నుంచి రోజుకు 75 మిలియన్ లీటర్ల మురుగు ఉత్పత్తి అవుతుండగా, అందులో 50 మిలియన్ లీటర్లు నేరుగా గోదావరిలోనే కలుస్తోందని గుర్తించారు. అదేవిధంగా తణుకు, భీమవరం, నరసాపురం, కొవ్వూరు మున్సిపాలిటీల నుంచి యనమదుర్రు, గోస్తనీ వంటి డ్రెయిన్ల ద్వారా పెద్ద ఎత్తున వ్యర్థ జలాలు నదిలోకి వదులుతుండటంపై డిప్యూటీ సీఎం సీరియస్ అయ్యారు. ఇకపై ఈ నీటిని శుద్ధి చేసేందుకు ప్రతి మున్సిపాలిటీలో మురుగు శుద్ధి కేంద్రాల (ఎస్టీపీ) నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. అదేవిధంగా గోదావరి పరివాహక మున్సిపాలిటీలన్నింటిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై దశలవారీ నిషేధాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించారు.

### థర్డ్ ఐ నిఘా

నదిలోకి దొంగచాటుగా మురుగు నీరు, పారిశ్రామిక వ్యర్థాలను వదిలేవారిపై నిఘా పెట్టేందుకు ఒక హైటెక్ పర్యవేక్షణా వ్యవస్థను సిద్ధం చేస్తున్నారు. ఆర్టీజీఎస్ తరహాలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, సీసీ కెమెరాల ద్వారా వ్యర్థాల శుద్ధి, విడుదలపై నిరంతర ప్రత్యక్ష పర్యవేక్షణ నిర్వహిస్తారు. పరిశ్రమల మురుగు నీటి నిర్వహణ పర్యవేక్షణకు ప్రత్యేక సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తారు. ఆధునిక సాంకేతికతతో కూడిన కాలుష్య నివారణ వ్యవస్థలను పరిశ్రమలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేశారు. ఇక ప్రధాన నదుల కాలుష్య నివారణకు ఏర్పాటు చేసిన అత్యున్నత స్థాయి 'పర్యావరణ పరిరక్షణ టాస్క్ ఫోర్స్'కి ఈ కంట్రోల్ రూమ్ నిర్వహణ బాధ్యతలను అప్పగించారు.

# బడి పిలుస్తోంది స్పెషల్ డ్రైవ్

**లక్ష్మి వారపు పేటలో ఐదు పాఠశాలల మెగా ఎన్రోల్మెంట్ డ్రైవ్**

**14మంది విద్యార్థులు నేడు ప్రభుత్వ బడిలో చేరిక**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** 2026-27 విద్యా సంవత్సరానికి ముందస్తుగా అమలు చేసిన ప్రణాళిక విజయవంతం అయిందని జిల్లా విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు అన్నారు. స్థానిక లక్ష్మి వారపుపేటలో ఈ ఉదయం ఐదు ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో, మెగా ఎన్రోల్మెంట్ డ్రైవ్ నిర్వహించారు. లక్ష్మి వారపు పేట, కోర్లమ్మ పేట, దేవి చౌక్ పాఠశాల అవాస ప్రాంతాలలో తల్లి తండ్రు లతో కలిసి, మాట్లాడి విద్యార్థులను బడికి చేర్పించారు. ఈరోజు డ్రైవ్ లో ముగ్గురు విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలలో చేరినట్టు, మొత్తం నేడు 14 అడ్మిషన్స్ జరిగినట్టు డి ఈ వో తెలిపారు. ఈ కార్యక్రమం లో అర్బన్ ఎం ఈ వో ఎం.వి ఎమ్. సుబ్రహ్మణ్యం,ఎమ్ ఈ వో -2 రమా రజని, సెయింట్ జాన్స్ రివర్ డేల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్, ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యేశ్వరి, లూథరన్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్యామ్ హుసేన్, కోర్లమ్మపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లేశ్వరరావు, వీరభద్రపురం స్పెషల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎస్ సుమలత, సి ఆర్ ఎం టి లు, జయంతి శాస్త్రి, కుమారి, జె.శ్రీనివాస రావు, పబ్బినీడి ప్రసాద్, కోటేశ్వరి,సునీత, ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

# గోదావరిని ముంచితే జైలుకే..! ఆంధ్రా పేపర్ మిల్లుకు మంత్రి దుర్గేష్ మాస్ వార్నింగ్

రాజమహేంద్రవరంలోని పవిత్ర గోదావరి నదిని కలుషితం చేస్తున్న పేపర్ మిల్లులపై మంత్రి దుర్గేశ్ తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. రెండు రోజుల క్రితం ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ ప్రాంతాన్ని పరిశీలించి నదిలోకి కలుషిత జలాలు వదలడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సమయంలో పర్యాటక మంత్రిగా దుర్గేశ్ చూసుకోవాలి కదా? అని అన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం రాజమహేంద్రవరంలో తన క్యాంపు కార్యాలయంలో దుర్గేశ్ మీడియా సమావేశం నిర్వహించారు. నిబంధనలు ఉల్లంఘించి గోదావరిలోకి వ్యర్థాలను వదిలితే ఎంతటి పెద్ద పరిశ్రమనైనా ఉపేక్షించేది లేదని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. చట్టప్రకారం నేరుగా జైలుకు పంపుతామని అత్యంత తీవ్రమైన హెచ్చరికలు జారీ చేశారు. ఆంధ్రా పేపర్ మిల్లు కాలుష్యంపై మంత్రి దుర్గేశ్ తీవ్రంగా మండిపడ్డారు. దొంగమాటలు చెబితే కుదరదు అంటూ తేల్చిచెప్పారు. వ్యర్థాలను శుద్ధి చేసిన తర్వాతే నీటిని వదులుతున్నామని యాజమాన్యం దొంగమాటలు చెబుతోందని ఫైర్ అయ్యారు. నిన్న స్వయంగా డిప్యూటీ సీఎం, మేము కళ్లారా చూసి నీటి గాఢతను చెక్ చేస్తే పీహెచ్ విలువ 7 కంటే ఎక్కువగానే ఉందని వెల్లడైందని స్పష్టం చేశారు. మీరెంత బాధ్యతా రాహిత్యంగా ఉన్నారో నిన్నటి ఘటన చూస్తే స్పష్టమవుతోంది. ఓవైపు లాభాలు పొందుతూ కార్మికులకు కనీసం వేతనాలు ఇవ్వరు" అని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.

### రూ. 13 కోట్ల బకాయిలు



మున్సిపాలిటీకి ఆంధ్రా పేపర్ మిల్లు కట్టాల్సిన రూ. 13 కోట్ల బకాయిలను ఇప్పటికీ కట్టలేదని, పలుమార్లు హెచ్చరించినా స్పందన లేదని మంత్రి తెలిపారు. పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం సహకరిస్తున్నప్పటికీ ధనార్జనే ధ్యేయంగా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే చూస్తూ ఊరుకోబోమని, మురుగును నేరుగా నదిలోకి వదిలితే జైలుకు పంపుతామని మాస్ వార్నింగ్ ఇచ్చారు. కాలుష్య వ్యర్థాలను పరిశ్రమలు వదులుతుంటే వాటర్ వర్క్స్ ద్వారా ప్రజలు ఆ నీటిని తాగునీటిగా తీసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని, దీనిని తీవ్రమైన అంశంగా పరిగణిస్తున్నామని మంత్రి వ్యాఖ్యానించారు.

### ప్లాస్టిక్ రహిత పుష్కరాలు

పుష్కరాల కోసం పంచాయతీరాజ్ శాఖ తరపున రూ. 100 కోట్ల నిధులు ఇచ్చేందుకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చొరవ చూపడం సంతోషకరమని మంత్రి దుర్గేష్ కొనియాడారు. పుష్కరాలకు వచ్చే దాదాపు 10 కోట్ల మంది భక్తులకు పవిత్రమైన, స్వచ్ఛమైన జలాల్లో పుణ్యస్నానాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా వెల్లడించారు. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ఈసారి పుష్కరాలను పూర్తిగా 'ప్లాస్టిక్ రహితం'గా నిర్వహించనున్నారు.

### కుంభమేళా తరహాలో ఏర్పాట్లు

కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించబోతున్నట్లు మంత్రి ప్రకటించారు. భక్తుల రద్దీని నియంత్రించేందుకు సాంప్రదాయ పద్ధతులతో పాటు ఆధునిక హంగులు జోడించనున్నామన్నారు. భక్తుల కోసం ప్రత్యేకంగా టెంట్ సిటీలు, హోమ్ స్టేలు, అత్యాధునిక హోటళ్లను అందుబాటులోకి తెస్తామని చెప్పారు. ఏ ఘాట్‌లో స్నానం చేసినా ఒకే పుణ్యఫలం లభిస్తుందనే అంశంపై భక్తులకు అవగాహన కల్పించి రద్దీని క్రమబద్ధీకరిస్తామన్నారు.


# ప్రపంచ రాజకీయ చరిత్రలో తొలిసారి.. హైబ్రిడ్ మహానాడు

అవకాశాల్ని అందిపుచ్చుకోవటం అందరికి సాధ్యమయ్యేది కాదు. కొందరు మాత్రమే ఆ పని చేయగలుగుతారు. పని ఏదైనా దాన్ని రొటీన్ కు భిన్నంగా చేయటం అంత ఆషామాషీ కాదు. తూతూ మంత్రంగా కాకుండా.. కమిట్ మెంట్ తో చేస్తే.. సరికొత్త చరిత్రను క్రియేట్ చేసే అవకాశం లభిస్తుంది. తాజాగా ఏపీ అధికారపక్షం తెలుగుదేశం పార్టీ అలాంటి పనినే చేసింది. పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ జయంతి సందర్భంగా పార్టీ మహానాడు కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటుందన్న సంగతి తెలిసిందే. అధికారంలో ఉన్నా.. లేకున్నా.. మహానాడు కార్యక్రమాన్ని వీలైనంత భారీగా నిర్వహించటం తెలుగుదేశం పార్టీకి అలవాటు. దాన్నో రాజకీయ సమావేశంగా కాకుండా.. పార్టీ విధానాలు రూపొందించే అత్యున్నత వేదికగా పని చేసేలా డిజైన్ చేయటం కనిపిస్తుంది. పరిస్థితులకు అనుగుణంగా ఎన్టీఆర్ పుట్టినరోజైన మే 28తో ముగిసేలా దీన్ని డిజైన్ చేస్తారు. మహానాడు ఆఖరి రోజున పార్టీ రాజకీయ తీర్మానాలను ఆమోదిస్తారు. అదే సమయంలో పార్టీకి వచ్చిన ఆదాయం.. ఖర్చులకు సంబంధించిన వివరాల్ని వెల్లడించటం కనిపిస్తుంది. ఈ మహానాడులో ప్రత్యేకత ఏమంటే.. పార్టీ అత్యుత్తమ నాయకత్వం మొదలు గ్రామీణ స్థాయి సాధారణ కార్యకర్త వరకు ఇందులో పాలుపంచుకునే అవకాశాన్ని కల్పిస్తారు. ఈ ఏడాది నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో ఇంధన పొదుపు గురించి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు ఇచ్చిన నేపథ్యంలో మహానాడును హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహించాలని డిసైడ్ చేశారు. అందుకు తగ్గట్లే భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు. వాస్తవానికి ఇలాంటి హైబ్రిడ్ విధానంలో రాజకీయ పార్టీ




నిర్వహించే కార్యక్రమాలు తూతూ మంత్రంగా లేదంటే ఒక మొస్తరుగా మాత్రమే నిర్వహించే వీలు ఉంటుంది. అందుకు భిన్నంగా.. దీన్నో అవకాశంగా తీసుకొని.. రొటీన్ గా నిర్వహించే మహానాడుకు మించి.. క్యాడర్ లో సరికొత్త జోష్ ను నింపేలా ప్లాన్ చేసిన తీరు ఇప్పుడు కొత్త చరిత్రకు కారణమైంది. ఆసక్తికరమైన అంశం ఏమంటే.. ప్రపంచంలో మరే రాజకీయ పార్టీ కూడా హైబ్రిడ్ విధానంలో ఇంతటి భారీ రాజకీయ సదస్సును నిర్వహించిన దాఖలాలు లేవు. టెక్నాలజీని ఉపయోగించుకొని ఒకే సమయంలో లక్షలాది మంది కలిసి కార్యక్రమాన్ని నిర్వహించుకోవటం.. అది కూడా ఏకపక్ష ప్రసంగంగా మాదిరి కాకుండా.. కేంద్ర కార్యాలయంలోని నేతలతో వివిధ క్లస్టర్లలోని కార్యకర్తలు ప్రత్యక్షంగా మాట్లాడేలా దీన్ని డిజైన్ చేయటం ఒక ప్రత్యేకతగా చెప్పాలి. ఏపీ వ్యాప్తంగా మొత్తం 1875 క్లస్టర్ కేంద్రాల్లో ఎల్ ఈడీ స్క్రీన్లు.. స్పీకర్ల ద్వారా ఏకకాలంలో లక్షలాది మంది ఒకేచోట పండుగ మాదిరి రాజకీయ సదస్సును నిర్వహించుకోవటం ఇదే తొలిసారి. నిజానికి ఈ హైబ్రిడ్ విధానంలో నిర్వహించే మహానాడు ఎలాంటి ఫలితాల్ని ఇస్తుందన్న సందేహం పార్టీ పెద్దల్లో ఒకలాంటి ఆందోళన వ్యక్తమైంది. అయితే..దీన్ని పటాపంచలు చేస్తూ.. కిందిస్థాయి నేతలు మొదలు కార్యకర్తలు ఉత్సాహంతో ముందుకు రావటంతో.. హైబ్రిడ్ మహానాడుకు ఏకంగా 24.50 లక్షల మంది హాజరై సరికొత్త రికార్డును క్రియేట్ చేశారు. ఈ స్పందన పార్టీ నాయకత్వాన్నే ఆశ్చర్యానికి గురి చేసిందని చెప్పాలి. ఇంత పెద్దఎత్తున ఒక రాజకీయ పార్టీ నిర్వహించిన హైబ్రిడ్ విధానానికి గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ లో నమోదు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లుగా చెబుతున్నారు. ఈ తరహాలో రాజకీయ సదస్సును గతంలో కొందరు ట్రై చేసినా.. ఇంత భారీ ఎత్తున నిర్వహించటం ఇదే తొలిసారిగా చెబుతున్నారు. బహామాస్ కు చెందిన ఫ్రీ నేషనల్ మూవ్ మెంట్ పార్టీ 2022లో తమ దేశ వ్యాప్త ప్రతినిధుల కోసం తమ మొదటి హైబ్రిడ్ కాంక్లేవ్ ను నిర్వహించింది. అయితే.. అది కేవలం కొంతమంది డెలిగేట్లతో ఇంటర్నల్ సమావేశం మాత్రమే. ఇంత భారీ ఎత్తున నిర్వహించింది లేదు.

కొవిడ్ సమయంలో అమెరికాలోని నాటి అధికార డెమొక్రాటిక్.. విపక్ష రిపబ్లికన్ పార్టీలు తమ జాతీయ కన్వెన్షన్లను వర్చువల్.. హైబ్రిడ్ పద్ధతిలో జరిపాయి కానీ.. ఇంత భారీ ఎత్తున మాత్రం కాదు. అదే సమయంలో మన దేశంలో బీజేపీ.. వైసీపీలు వర్చువల్ ర్యాలీలు.. ఆన్ లైన్ సమావేశాలు నిర్వహించాయి. కానీ.. పొదుపు చర్యల్లో బాగంగా గ్రామస్థాయి వరకు డిజిటల్ కేంద్రాల్ని ఏర్పాటు చేసి.. లక్షలాది మందిని ఒకే సమయంలో ఒకేచోటు కలిపేలా హైబ్రిడ్ వార్షిక మహోత్సవానికి మాత్రం తెలుగుదేశం పార్టీకే దక్కుతుంది.





# ఓఎన్జీసీ ప్రతినిధులతో సమావేశమైన ఎంపీ హరీష్ బాలయోగి



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం ఓఎన్‌జీసి ప్రాంతీయ కార్యాలయంలో సంస్థ ప్రతినిధులతో అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి సమావేశమయ్యారు. డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో జరుగుతున్న ఓ ఎన్ జీ సి కార్యకలాపాలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. జిల్లాలో చేపట్టిన మరియు చేపట్టాల్సిన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సంస్థ ప్రతినిధులకు ఎంపీ హరీష్ సూచించారు.

### జాబ్ మేళాలో ఇంజనీర్లుగా ముగ్గురు ఎంపిక రామచంద్రపురం ఉపాధి భవన్‌లో

# విజయవంతంగా ముగిసిన 43వ జాబ్ మేళా

**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నియోజకవర్గంలో నిరుద్యోగ నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఉపాధి భవన్‌లో నిర్వహించిన 43వ జాబ్ మేళా విజయవంతంగా ముగిసింది. నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే ఉద్దేశ్యంతో ప్రతి వారం క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న ఈ ఉపాధి కల్పనా కార్యక్రమంలో భాగంగా తాజాగా ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలలో అడెక్కో ఏజెన్సీ ద్వారా ఎయిర్‌టెల్



ఫైబర్‌నెట్ విభాగానికి ముగ్గురు యువకులు హెచ్.డి.బి ఇంజనీర్లుగా ఎంపికయ్యారు. కంపెనీ హెచ్‌ఆర్ ప్రతినిధి వెంకటరమణ ఆధ్వర్యంలో అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి వారి ప్రతిభ ఆధారంగా ఎంపిక చేయడం జరిగింది. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. తమకు ఈ అద్భుతమైన అవకాశాన్ని కల్పించిన సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, అలాగే ఉపాధి భవన్ అధినేత రామ్ కుమార్‌లకు ఎంపికైన అభ్యర్థులు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# జెన్ ఆల్ఫా.. లోకేష్ ఫ్యూచర్ రెడీ ప్లాన్?

తెలుగుదేశం పార్టీ వార్షిక పండుగ మహానాడు తొలిరోజే ఒక స్పష్టమైన రాజకీయ దిశను చూపెట్టిందనే చర్చ జరుగుతోంది. పసుపు పండుగ వేదికగా టీడీపీ కేవలం ప్రస్తుత రాజకీయాల గురించే మాట్లాడటానికే పరిమితం కాకుండా, రాబోయే తరాలను దృష్టిలో పెట్టుకుని విజన్ పాలసీకి సిద్ధమవుతున్నట్లు సంకేతాలిచ్చిందని అంటున్నారు. ముఖ్యంగా టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ ఏకకాలంలో రెండు వేర్వేరు తరాలను ఆకట్టుకునేలా వ్యూహాత్మకంగా ప్రసంగించారని అంటున్నారు . ఒకవైపు పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ నుంచి వస్తున్న వస్తున్న పాత క్యాడర్ భావోద్వేగాలకు పెద్దపీట వేస్తూనే మరోవైపు గ్లోబల్ ట్రెండ్స్ కు తగ్గట్టు జెన్ జీ, జెన్ ఆల్ఫా అంటూ కొత్త తరాన్ని ఆకర్షించేలా మంత్రి లోకేశ్ ప్రకటనలు ఉన్నాయని అంటున్నారు. మహానాడు తొలిరోజు తీసుకున్న నిర్ణయాలు, ఐటీ మంత్రి నారా లోకేష్ ప్రసంగం గమనిస్తే టీడీపీ తనను తాను ఒక 'ఫ్యూచర్ రెడీ' డిజిటల్ పార్టీగా ప్రొజెక్ట్ చేసుకోడానికి ప్రయత్నాలు ప్రారంభించిందని విశ్లేషిస్తున్నారు.

**'జెన్ ఆల్ఫా'పై తొలిసారిగా చర్చ**

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జెన్ జీ కోసమే చర్చ జరుగుతోంది. ప్రపంచంలో ఎక్కడ ఏ రాజకీయ, సామాజిక ఉద్యమం జరిగినా దాని వెనుక జెన్ జీ యువతే ఉంటున్నారు. తాజాగా ఆన్ లైన్ సంచలనంగా మారిన 'కాక్రోచ్ జనతా పార్టీ' కూడా జెన్ జీ ప్రభావమే అని విశ్లేషిస్తున్నారు. జెన్ జీ అంటే 1997 నుంచి 2012 మధ్య పుట్టినవారు. అంటే దాదాపు 30 ఏళ్లలోపు ఉన్న యువత సామాజిక మాధ్యమాల్లోనూ సామాజిక కార్యక్రమాల్లోనూ ఎక్కువగా ప్రభావితమవుతున్నారని చెబుతున్నారు. ఈ తరాన్ని ఆకట్టుకోవడంతోపాటు వారి తర్వాత వచ్చే తరాన్ని ఆకర్షించేలా ఫ్యూచర్ ప్లాన్ రెడీ చేస్తున్నట్లు



మంత్రి లోకేశ్ ప్రకటించడం ఆసక్తికర చర్చగా మారిందని అంటున్నారు. మహానాడు వేదికగా జెన్ జీతోపాటు జెన్ ఆల్ఫా కోసమూ తాము పనిచేస్తున్నామని, వారికి గొప్ప అవకాశాలు ఉన్నాయని లోకేశ్ ప్రకటించారు. దీంతో జెన్ ఆల్ఫా గ్రూప్ పై చర్చ మొదలైంది. 2010 నుంచి 2024 మధ్య జన్మించిన పిల్లలను జెన్ ఆల్ఫా తరంగా పిలుస్తున్నారని చెబుతున్నారు.

**లోకేష్ లాంగ్ టర్మ్ ఫోకస్**

ప్రస్తుతం జెన్ జీ ఓటర్లను ఆకట్టుకునేందుకే రాజకీయ పార్టీలు ఆరాటపడుతుండగా, యువనేత నారా లోకేష్ ఒకడుగు ముందుకు వేసి 'జెన్ ఆల్ఫా' పేరు ప్రస్తావించడం రాజకీయ విశ్లేషకులను సైతం ఆశ్చర్యపరిచింది. ఇది కేవలం ఒక ప్రసంగ పాఠమే కాదని, రాబోయే 15-20 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ ప్రయాణానికి టీడీపీ సిద్ధమవుతోందనడానికి సంకేతంగా చూడాలని పరిశీలకులు వ్యాఖ్యాని స్తున్నారు. అమరావతి క్వాంటమ్ వ్యాలీ, ఏఐ సిటీ, గ్లోబల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ వంటి సాంకేతిక అంశాలను లోకేష్ నిరంతరం ప్రస్తావించడం వెనుక ఉద్దేశం ఇదే అంటున్నారు. సాంకేతికతతో పెరిగే 'జెన్ ఆల్ఫా' మానసిక స్థితికి తగ్గట్టుగా పార్టీని ఇప్పటి నుంచే మలచాలనేది లోకేశ్ వ్యూహంగా కనిపిస్తోందని చెబుతున్నారు.

**33% మహిళా టికెట్లు**

ఈ ఫ్యూచర్-రెడీ మైండ్‌సెట్ మహానాడు నిర్వహణలోనూ స్పష్టంగా కనిపించిందని అంటున్నారు. భౌతికంగా హాజరైన క్యాడర్‌తో పాటు డిజిటల్ మాధ్యమాల ద్వారా లక్షలాది మందిని అనుసంధానిస్తూ నిర్వహించిన 'హైబ్రిడ్ మహానాడు' సాంకేతికతకు అద్దం పట్టిందని చెబుతున్నారు. దీనికి తోడు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 33 శాతం టికెట్లు కేటాయిస్తామని లోకేష్ ప్రకటించడం అత్యంత సాహసోపేతమైన నిర్ణయంగా అభివర్ణిస్తున్నారు. ఇటు సామాజిక సమీకరణాలను బ్యాలెన్స్ చేస్తూనే, అటు భవిష్యత్తు రాజకీయాల్లో మహిళా నాయకత్వాన్ని పెంచేందుకు ఇది ఉపయోగపడుతుందని చెబుతున్నారు.

**భావోద్వేగానికి.. టెక్నాలజీకి ముడిపడేనా?**

పార్టీ వర్కింగ్ ప్రెసిడెంటుగా బాధ్యతలు స్వీకరించిన లోకేశ్ అత్యంత కఠినమైన సవాల్ స్వీకరించారని అంటున్నారు. ఎన్టీఆర్ ఆశయాలు, సంక్షేమ పథకాలు, పాత తరం గ్రౌండ్ లెవెల్ పాలిటిక్స్‌ను వదలకుండా... ఈ సరికొత్త 'జెన్ జీ', 'జెన్ ఆల్ఫా' టెక్నాలజీ విజన్‌తో ఎలా అనుసంధానిస్తారు అనేది చూడాల్సివుందని అంటున్నారు. ఈ సరికొత్త 'టూ-జెనరేషన్' పొలిటికల్ థియరీ వినడానికి, వెబ్ వేదికలపై చర్చించడానికి చాలా ఆకర్షణీయంగా ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అంత సులభంగా అమలవుతుందా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా ఉందని అంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పాత క్యాడర్ ఇంకా సాంప్రదాయ రాజకీయ శైలిలోనే ఉన్నారని వారిని డిజిటల్ ఓటర్ల ఆలోచనలకు అనుగుణంగా మార్చడం పెద్ద సవాల్ గా చెబుతున్నారు.

# ఆదాయంలో 'సైకిల్' రికార్డు.. ఖర్చులో 'ఫ్యాన్' ఫస్ట్

దేశంలో రాజకీయ పార్టీల ఆదాయ, వ్యయ లెక్కల్లో ఆసక్తికర అంశాలు వెలుగుచూశాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో దేశంలో అత్యధిక ఆదాయం వచ్చిన ప్రాంతీయ పార్టీగా టీడీపీ రికార్డు సృష్టించింది. ఇదే సమయంలో ఎక్కువ ఖర్చు పెట్టిన పార్టీగా వైసీపీ నిలిచింది. దేశవ్యాప్తంగా ప్రాంతీయ పార్టీల ఆర్థిక పరిస్థితిపై అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫామ్స్ సంస్థ ప్రత్యేక నివేదికను విడుదల చేసింది. దీని ప్రకారం తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన పార్టీలు జాతీయ స్థాయిలో అగ్రస్థానాల్లో నిలవడం విశేషంగా వ్యాఖ్యానిస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను దేశంలోనే అత్యధిక ఆదాయం గడించిన ప్రాంతీయ పార్టీగా తెలుగుదేశం సరికొత్త రికార్డు సృష్టించింది. సార్వత్రిక ఎన్నికల వేళ వ్యూహాత్మకంగా అడుగులు వేసిన టీడీపీ ఏకంగా రూ.228.31 కోట్ల ఆదాయంతో దేశంలోనే అత్యంత సంపన్న ప్రాంతీయ పార్టీగా అవతరించిందని ఏడీఆర్ నివేదిక వెల్లడించింది. టీడీపీ తర్వాత పశ్చిమ బెంగాల్‌కు చెందిన తృణమూల్ కాంగ్రెస్ రూ. 219 కోట్ల ఆదాయంతో రెండో స్థానంలో నిలిచింది. విపక్ష వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రూ.140 కోట్ల ఆదాయంతో మూడో



స్థానాన్ని దక్కించుకుంది. ఆదాయం ఒకెత్తయితే.. ఎన్నికల వేళ జనాల్లోకి వెళ్లేందుకు పార్టీలు చేసిన ఖర్చులు మరో ఎత్తు. ఈ వ్యయాల విభాగంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ దేశంలోని అన్ని ప్రాంతీయ పార్టీలను వెనక్కి నెట్టి మొదటి స్థానంలో నిలిచింది. 2024-25లో వైసీపీ ఏకంగా రూ. 340.20 కోట్లు ఖర్చు చేసింది. ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే, తమకు వచ్చిన ఆదాయం రూ. 140 కోట్లు అయితే.. అంతకంటే దాదాపు రెట్టింపు మొత్తాన్ని పార్టీ ఎన్నికల ప్రచారం కోసం ఖర్చు పెట్టిందని ఏడీఆర్ నివేదిక తేల్చింది. వైసీపీ తర్వాత ఒడిశాకు చెందిన బిజూ జనతా దళ్ రెండో స్థానంలో, తృణమూల్ కాంగ్రెస్ మూడో స్థానంలో ఖర్చు చేసినట్లు చెబుతున్నారు. గత ఆర్థిక సంవత్సరాలతో పోలిస్తే ఈ పాత-కొత్త లెక్కల మధ్య స్పష్టమైన మార్పులు కనిపిస్తున్నాయి. సాధారణ రోజుల్లో ప్రాంతీయ పార్టీల ఆదాయ వనరులు పరిమితంగా, స్థిరంగా ఉండేవి. కానీ ఎన్నికల సంవత్సరమైన 2024-25లో కార్పొరేట్ నిధులు, భారీ విరాళాలతో పార్టీలకు నిధుల వరద పారిందని విశ్లేషిస్తున్నారు. గతంలో చాలా పార్టీలు తమకు వచ్చిన ఆదాయంలోనే పొదుపుగా ఖర్చు చేస్తూ, మిగిలిన మొత్తాన్ని భవిష్యత్తు అవసరాల కోసం ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసేవి. కానీ ఈసారి గెలుపే ఏకైక లక్ష్యంగా పెట్టుకోవడంతో, రాబడిని మించి భారీగా వ్యయం చేశాయని అంటున్నారు. దేశంలో మొత్తం 67 గుర్తింపు పొందిన ప్రాంతీయ పార్టీలు ఉండగా.. అందులో కేవలం 36 పార్టీలు మాత్రమే నిర్ణీత గడువులోగా తమ ఆడిట్ నివేదికలను ఎన్నికల సంఘానికి సమర్పించాయి. వీటిని ఆధారంగా చేసుకునే ఏడీఆర్ నివేదిక రూపొందించినట్లు వెల్లడించింది. ఇంకా 31 పార్టీలు తమ అధికారిక లెక్కలను అప్పగించాల్సి ఉందని అంటున్నారు. మిగిలిన పార్టీల లెక్కలు కూడా వస్తే ఈ గణాంకాల్లో మరికొన్ని ఆసక్తికర మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని వ్యాఖ్యానిస్తున్నారు.

### దళిత నాయకుడు నాగాబత్తుల నరసింహామూర్తి సతీమణి

# లక్ష్మి అకాల మరణం



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కొనసీమ జిల్లా అధ్యక్షులు, ప్రముఖ దళిత నాయకులు నాగబత్తుల నరసింహమూర్తి సతీమణి నాగాబత్తుల లక్ష్మి (65 ) అకాల మరణం చెందారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. నాగాబత్తుల లక్ష్మి గతంలో నందంపూడి పంచాయితీ వార్డు సభ్యురాలిగా సేవలందించారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుటుంబ సమేతంగా తమిళనాడు పరిసర ప్రాంతాలకు పర్యటనకు వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో అస్వస్థతకు గురయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను రాజమండ్రిలోని బొల్లినేని హాస్పిటల్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున ఆమె మృతి చెందారని కుటుంబీకులు తెలిపారు. శుక్రవారం ఆమె మృతదేహాన్ని స్వగ్రామమైన నందంపూడికి తరలించి కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు, రాజకీయ, దళిత నాయకులు, సామాజిక నాయకులు, నాగాబత్తుల నరసింహామూర్తి కుటుంబాన్ని పరామర్శించి లక్ష్మి మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. అకాల మరణంతో కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు సంతాపం తెలిపారు.

### టీడీపీ మహానాడులో సరికొత్త సంచలనం..

# ట్రాన్స్‌జెండర్ వర్షిణికి అరుదైన అవకాశం!



తెలుగుదేశం పార్టీ ప్రతి ఏటా ఘనంగా నిర్వహించే 'మహానాడు' ప్రతినిధుల సభల్లో ఈ సారి ఒక విప్లవాత్మక మార్పు చోటుచేసుకుంది. సమాజంలో తీవ్రమైన వివక్షను ఎదుర్కొనే ట్రాన్స్‌జెండర్ వర్గానికి మహానాడు వేదికగా సముచిత స్థానం దక్కింది. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి పిఏగా పనిచేస్తున్న వర్షిణిని సీఎం చంద్రబాబు తన పక్కనే కూర్చొబెట్టుకున్నారు. అంతేకాకుండా మహానాడు వేదికపై మాట్లాడే అరుదైన అవకాశాన్ని కల్పించారు. టీడీపీ చరిత్రలో ఒక ట్రాన్స్‌జెండర్ పార్టీ ప్రధాన వేదికపై ప్రసంగించడం ఇదే తొలిసారి కావడం విశేషంగా చెబుతున్నారు.


**వర్షిణి భావోద్వేగ ప్రసంగం**

వేదికపై తనకు వచ్చిన అవకాశాన్ని వర్షిణి చక్కగా వినియోగించుకున్నారు. గత ప్రభుత్వాల పాలనకు, ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనకు ఉన్న వ్యత్యాసాన్ని వివరించారు. వివక్ష ఎదుర్కొనే తమకు ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలోనే గుర్తింపు, గౌరవం దక్కిందని భావోద్వేగం వ్యక్తం చేశారు. చంద్రబాబు పాలనలో 2014-2019 మధ్యకాలంలో టీడీపీ ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్లకు పెన్షన్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఆర్థికంగా, సామాజికంగా అండగా నిలిచిందని గుర్తుచేసుకున్నారు. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం తమ వర్గాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని వాపోయారు. తమకు దక్కాల్సిన కనీస సౌకర్యాలను కూడా దూరం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ తమ జీవితాల్లో మార్పులు ప్రారంభమయ్యాయని వివరించారు. తమకు గుర్తింపుతో పాటు సమాజంలో గౌరవం దక్కుతోందని ఆమె హర్షం వ్యక్తం చేశారు. 'సమాజం మమ్మల్ని చూసే కోణాన్ని మార్చడంలో టీడీపీ ఎప్పుడూ ముందుంటుంది. నాడు చంద్రబాబు గారు మాకు పెన్షన్లు ఇస్తే.. నేడు ఎమ్మెల్యే గల్లా మాధవి గారు నన్ను పీఏగా పెట్టుకుని సమాజంలో తల ఎత్తుకుని బతికే గౌరవాన్ని ఇచ్చారు.' అంటూ వర్షిణి ఆనందంగా చెప్పారు.

**ఎమ్మెల్యే గల్లా మాధవిపై ప్రశంసలు**

వర్షిణిని కేవలం ఒక కార్యకర్తగానే కాకుండా, తన పర్సనల్ అసిస్టెంట్‌గా నియమించుకుని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి అప్పట్లోనే ఆదర్శంగా నిలిచారు. ఇప్పుడు ఏకంగా మహానాడు వంటి ప్రతిష్టాత్మక వేదికపై వర్షిణికి మాట్లాడే అవకాశం కల్పించడం వెనుక పార్టీ అధిష్ఠానం, స్థానిక నాయకత్వం తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ సభలు అంటే కేవలం ఉపన్యాసాలు, విమర్శలకే పరిమితం కాకుండా సమాజంలో వెనుకబడిన, వివక్షకు గురవుతున్న వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించడమే నిజమైన సామాజిక న్యాయం అని టీడీపీ ఈ ఘట్టం ద్వారా నిరూపించిందని అభినందిస్తున్నారు. వర్షిణి చేసిన ప్రసంగం మహానాడుకు వచ్చిన ప్రతినిధులను ఎంతగానో ఆకట్టుకోవడమే కాకుండా, సోషల్ మీడియాలోనూ వైరల్‌గా మారిందని చెబుతున్నారు.

# వార్డుల నుంచి సర్ వరకు.. వైసీపీలో గుబులు..!



రాష్ట్రంలో రెండు కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఒకటి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా వార్డులను ఏర్పాటు చేయడం. రెండోది స్పెషల్ ఇంటెన్సీ రివిజన్ (సర్) పేరుతో కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాను నవీకరించడం. ఈ రెండు అంశాలు అత్యంత కీలకంగా మారాయి. పార్టీలకు, రాజకీయ నేతలకు కూడా ఈ రెండు అంశాలు ప్రభావాన్ని చూపించే అవకాశం ఉందన్న వాదన కూడా వినిపిస్తోంది. మరో రెండు మూడు నెలల్లో రాష్ట్రంలో స్థానిక సంస్థలు ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో వార్డుల విభజన చేయాలని ప్రభుత్వం నిర్ణయించుకుంది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో వార్డుల విభజన ప్రక్రియ ప్రారంభమైంది. దీంతో అధికారులు ప్రజల నుంచి సలహాలు సూచనలు తీసుకుంటున్నారు. అభ్యంతరాలను స్వీకరిస్తున్నారు. అయితే వైసిపి తరపున ఈ వ్యవహారం పై తీవ్ర ఆందోళన వ్యక్తం అవుతుంది. నెల్లూరు, కర్నూలు, కడప, విశాఖపట్నం, అనంతపురం సహా పలు ఉమ్మడి జిల్లాల్లో వార్డుల విభజన పేరుతో తమ ఓటు బ్యాంకును పోగొడుతున్నారన్న వాదన వైసీపీలో వినిపిస్తోంది. వార్డులను విభజించడం ద్వారా తమ ఓటు బ్యాంకును నష్టపరిచే ప్రక్రియ సాగుతోందని ఇటీవల మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి కూడా వ్యాఖ్యానించారు. విశాఖపట్నంలోనూ ఇదే తరహాలో నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే దీనిని పారదర్శకంగానే చేపడుతున్నామని అధికారులు చెబుతున్నారు. మరోవైపు సర్ ప్రక్రియ వచ్చే నెల 16 నుంచి రాష్ట్రంలో ప్రారంభం కానుంది. దీనిపై కూడా వైసీపీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తుంది. సాక్షాత్తు జగనే సర్ ప్రక్రియ విషయంపై వివరణ ఇస్తూ పలు రాష్ట్రాలను ఉదహరించారు. అక్కడ ఓటు బ్యాంకు తగ్గడం కారణంగానే అధికారం కోల్పోయారనే విషయాన్ని కూడా ఆయన చెప్పారు. వాస్తవానికి సర్ ప్రక్రియపై ఇతర రాజకీయ పార్టీలకు కూడా కొన్ని అనుమానాలు అయితే ఉన్నాయి. అయినప్పటికీ వైసీపీలో మాత్రం మరింత ఎక్కువగా కనిపిస్తోంది. మరి దీనిని ఏ విధంగా చూస్తారు.. నిజంగానే ఓటు బ్యాంకు తగ్గిపోతుందా అనేది ఆసక్తిగా మారింది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో అటు వార్డు విభజనను గాని ఇటు సర్ ప్రక్రియను కానీ భౌతికంగా అడ్డుకునే పరిస్థితి అయితే లేదు. అవి కొనసాగుతాయి. కాబట్టి నాయకులు రంగంలోకి దిగి వారి వారి ఓటు బ్యాంకు ను కాపాడుకునే దిశగా అడుగులు వేయాలి. కానీ ఈ తరహా ప్రయత్నాలు వైసీపీలో జరగకపోవడంతో అధిష్టానానికి గుబులు పట్టుకుంది.



# “జ్యోతుల” జన్మదినాన పలు సామాజిక సేవా కార్యక్రమాలు





**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు మండల జనసేన పార్టీ అధ్యక్షులు జ్యోతుల శ్రీనివాసు 49 వ జన్మదినోత్సవం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో జ్యోతుల శ్రీనివాసు జన్మదినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వన్నెపూడి గ్రామంలో జనసేన మండల ఉపాధ్యక్షులు పాలశెట్టి తమ్మారావు ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు గొల్లప్రోలు మండల మండల ప్రజా పరిషత్తు మాజీ అధ్యక్షులు భవిరిశెట్టి రాంబాబు అధ్యక్షతన కేక్ కట్ చేసి పలువురుకు స్వీట్లను పంచిపెట్టారు. పిఠాపురం కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో 150 మంది ఇన్ పేషెంట్లకు, అవుట్ పేషెంట్లకు రొట్టెలు, పండ్ల కిట్లను పంపిణీ చేశారు. దుర్గాడలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రం ప్రాంగణం, రెండు సచివాలయాల ప్రాంగణాల్లోనూ పలు రకాల మొక్కలను నాటారు. స్థానిక ఇబిసి కాలనీలో కాపారపు వెంకటరమణ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని జ్యోతుల శ్రీనివాసు ప్రారంభించారు. దుర్గాడ గ్రామంలో పలు వీధులలో కేక్ కటింగ్ కార్యక్రమాలను చేశారు. అలాగే శంఖవరం మండలం కత్తిపూడిలోని మొదటి సాయిప్రియా ట్రేడర్స్ దుకాణం సముదాయం ఆవరణలో దుకాణ యజమాని, పాత్రికేయుడు దూది సూర్య ఆధ్వర్యంలో కూడా జ్యోతుల శ్రీనివాస్ జన్మదిన వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. జ్యోతుల శ్రీనివాస్ జిల్లా వ్యాప్తంగా చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను, పార్టీ కార్యక్రమాలకు ప్రశంసించారు. అనంతరం జ్యోతుల శ్రీనివాసు స్వగృహంలో నిర్వహించిన జన్మదిన వేడుకల్లో గ్రామ శివాలయం పురోహితులు వేదపండితులు శ్రీనివాస్ కు వేదాశీర్వాదాలు అందజేశారు. క్రైస్తవ పాస్టర్లు ప్రార్థనలు చేసి దీవించారు. గొల్లప్రోలు మండల మహిళ సమైక్య సంఘం సభ్యులు, మండల మహిళ సమైక్య అసిస్టెంటు ప్రాజెక్టు మేనేజర్ సన్యాసిరావు, చేబ్రోలు సిసి తురాల శ్రీనివాసు, దుర్గాడ మహిళా సమాఖ్య సిబ్బందితోపాటు గొల్లప్రోలు మాజీ ఎంపిపి. బవిరిశెట్టి రాంబాబు, గొల్లప్రోలు మండల జనసేన ఉపాధ్యక్షులు పాలశెట్టి తమ్మారావు, పిఠాపురం నగర జనసేనపార్టీ ఉపాధ్యక్షులు బాలేపల్లి అనిల్, కోపరేటివ్ బ్యాంక్ మాజీ చైర్మన్ బాలపల్లి రాంబాబు, దుర్గాడ జిల్లా పరిషత్ హై స్కూలు చైర్మన్ శాఖ నాగేశ్వరరావు, మాజీ చైర్మన్ కందా శ్రీనివాసు, గ్రామ జనసేన ఉపాధ్యక్షులు గొల్లపల్లి శివ, దుర్గాడ భవన నిర్మాణ కార్మికుల సంఘ అధ్యక్షులు ఆకుల అర్జున్ తోపాటు పలువురు అభిమానులు జ్యోతుల శ్రీనివాసును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జ్యోతుల శ్రీనివాసు మాట్లాడుతూ తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, ఆశీర్వదించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జ్యోతుల గోపి, జ్యోతుల సాంబశివరావు, జ్యోతుల గణపతి, రెడ్నం రమేష్, మాజీ ఎమ్.పి.టి.సి. సభ్యుడు కొమ్మూరి కృష్ణ, కొప్పుల చక్రదర్, మేడిబోయిన గోపికృష్ణ, కొల్లా శివ, సఖినాల రాంబాబు, కాపారపు వెంకటరమణ, కీర్తి చిన్నా, పోలం త్రిమూర్తులు, వెలుగుల వాసు, జ్యోతుల వాసు, మంతెన గణేష్, చేశెట్టి భద్రం, మేడిబోయిన హరి, ఈలిశెట్టి వేణు తదితరులు పాల్గొన్నారు.

# “నేటి పిల్లల చదువు - రేపటి ఉత్తమ భవిష్యత్తుకు ఆదరువు”

### - జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంరక్షణాధికారి విజయ





**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** “ నేటి పిల్లల చదువు--రేపటి ఉత్తమ భవిష్యత్తుకు ఆదరువు” అని కాకినాడ జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంరక్షణ అధికారి జె.విజయ పేర్కొన్నారు. పిల్లలు దేశానికి వెన్నెముక లాంటివారు. నేటి పిల్లల చదువుపైనే రేపటి సమాజం, దేశం యొక్క ప్రగతి ఆధారపడి ఉంటుంది. విద్య అనేది కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా, ఒక మనిషిని సంపూర్ణ వ్యక్తిగా తీర్చిదిద్దే అద్భుతమైన ఆయుధమని ఆమె వివరించారు. జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సి.హెచ్.లక్ష్మి ఆదేశాల మేరకు ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం, రౌతులపూడి మండలాల శంఖవరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ. పర్వత వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో శంఖవరం మండలం నెల్లిపూడి సచివాలయంలో “కిషోరి వికాసం” సమ్మర్ క్యాంపెయిన్‌లో భాగంగా కౌమార బాలికలు, కౌమార బాలురకు వేర్వేరుగా అవగాహనా కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించారు. దీనిలో విజయ మాట్లాడుతూ... బాల్య వివాహాలు, బాల కార్మికత్వం వంటి సమస్యలను తగ్గించడంలో విద్య ముఖ్య పాత్ర పోషిస్తుంది. విద్యతో మంచి జ్ఞానం, నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం కలుగుతుంది. ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని నిర్ణయించుకొని కష్టపడి చదవాలి. 10వ తరగతి తరువాత ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, వృత్తి విద్య వంటి అవకాశాల గురించి తెలుసు కోవాలి. డాక్టర్, ఇంజనీర్, టీచర్, పోలీస్, నర్స్, బ్యాంకింగ్, కంప్యూటర్ రంగాల్లో అనేక ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి. కమ్యూనికేషన్ స్కిల్స్ కంప్యూటర్ నైపుణ్యాలు అభివృద్ధి చేసుకోవాలి. కెరీర్ ఎంపికలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, నిపుణుల సలహాలను తీసుకోవాలని విజయ సూచించారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో “కిషోరి వికాసం” వేసవి సమావేశాలను మే 1 నుండి జూన్ 10 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశాలు 11 నుండి 18 సంవత్సరాల వయస్సు కౌమార బాలికలకు అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో చేపడుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆరోగ్యం, పోషణ, వ్యక్తిత్వ వికాసం, విద్య యొక్క ప్రాముఖ్యత, లైంగిక, ప్రజనన ఆరోగ్యం, బాల్య వివాహాల నివారణ, బాలల రక్షణ వంటి అంశాలపై గ్రామ మరియు వార్డు స్థాయిలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాల్ని నిర్వహిస్తామని తెలిపారు. ఈరోజు సెషన్ -9 లో విద్య ప్రాముఖ్యత, కెరియర్ గైడెన్స్ కార్యక్రమంలో భాగంగా కౌమార దశలో ఉన్న బాల బాలికలకు సరైన మార్గదర్శకత్వం అందించడం, వారి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా ఎదగడానికి సహాయపడటం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యమని కాకినాడ జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంరక్షణ అధికారి జె.విజయ వివరించారు. అనంతరం కిషోరీ బాలురు, బాలికలకు వేరువేరుగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సెక్టర్ సూపర్వైజర్ బి.వెంకటరజని, అంగన్వాడీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# పెట్టుబడుల కోసం పోటీకి రెడీ..

**తమిళనాడు మంత్రికి లోకేశ్ ఫ్రెండ్లీ ఛాలెంజ్! - ఏపీ, తమిళనాడు మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉంటుందని స్పష్టీకరణ**
**పెట్టుబడులే ఉద్యోగాలు సృష్టిస్తాయని, ట్రోల్స్‌ను పట్టించుకోవద్దని హితవు - లోకేశ్ ట్వీట్‌కు ధన్యవాదాలు తెలుపుతూ కీర్తన ప్రత్యుత్తరం**

**విశ్వం వాయిస్ న్యూస్ :** పొరుగు రాష్ట్రమైన తమిళనాడుతో పెట్టుబడుల ఆకర్షణ లో ఆంధ్రప్రదేశ్ కచ్చితంగా పోటీ పడుతుందని, ఈ పోటీ ఆరోగ్యకరం గా ఉంటుందని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. తమిళనాడు పరిశ్రమల శాఖ మంత్రి కీర్తన తన రాష్ట్రానికి పెట్టుబడులను ఆహ్వానిస్తూ సోషల్ మీడి యాలో చేసిన పోస్టుకు లోకేశ్ బదులిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యల ద్వారా పెట్టుబడుల విషయంలో రెండు రాష్ట్రాల మధ్య తీవ్రమైన పోటీ తప్పదని లోకేశ్ పరోక్షంగా సూచించారు.

**అసలేం జరిగింది?**

తమిళనాడు పరిశ్రమల శాఖ మంత్రి కీర్తన, తమ రాష్ట్రంలో పెట్టు బడులకు ఉన్న అవకాశాలను వివరిస్తూ ‘ఎక్స్’ (ట్విట్టర్) వేదికగా ఒక వీడియోను పోస్ట్ చేశారు. “తమిళనాడు భవిష్యత్తు కోసం ఎదురుచూడటం లేదు, ఆ భవిష్యత్తును మేమే నిర్మిస్తున్నాం. సింగిల్ విండో విధానం, వేగవంతమైన అనుమతులు, ఏఐ నగరాలు, గ్రీన్ హైడ్రో జన్, అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ వంటి రంగాల్లో ఆవిష్కరణలకు చిరునామాగా నిలుస్తున్నాం” అంటూ పెట్టుబడిదారులను ఆహ్వానించారు. ఈ వీడియోపై మంత్రి నారా లోకేశ్ స్పందిస్తూ, కీర్తనను అభినందించారు. “కీర్తన గారూ, పెట్టు బడులను ఆకర్షించేందుకు మీరు చూపుతున్న చొరవ అభినందనీయం. ప్రతి మంత్రి తమ రాష్ట్రాన్ని మార్కెటింగ్ చేసుకోవాలి. పెట్టుబడిదారులతో చర్చలు జరిపి, ఉపాధి కల్పించే వారిలో నమ్మకాన్ని నింపాలి. దేశాభివృద్ధిలో రాష్ట్రాలు పోటీపడటాన్ని ప్రధాని మోదీ కూడా ప్రోత్సహిస్తారు” అని పేర్కొన్నారు. అదే సమయంలో “ఆంధ్రప్రదేశ్ నిస్సందేహంగా తమిళనాడుకు గట్టి పోటీ ఇస్తుంది. ఈ



సోషల్ మీడియా గోలంతా పట్టించుకోవద్దు. ట్రోల్స్ ఉద్యోగాలు సృష్టించవు, పెట్టుబడులు మాత్రమే ఉద్యోగాలను సృష్టిస్తాయి” అంటూ చురక అంటించారు. లోకేశ్ చేసిన ఈ పోస్టుపై మంత్రి కీర్తన కూడా హుందాగా స్పందించారు. “థ్యాంక్యూ లోకేశ్ గారు. తమిళనాడు ప్రజలకు, ముఖ్యంగా నా నియోజకవర్గ యువతకు అవకాశాలు కల్పించడానికి చిత్తశుద్ధితో, వినయంతో, పట్టుదలతో పనిచేస్తూనే ఉంటాను” అని ఆమె బదులిచ్చారు. మొత్తం మీద ఈ ట్వీట్ల సంభాషణ ద్వారా లోకేశ్.. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్, మంత్రి కీర్తనలకు పెట్టుబడుల విషయంలో తాము గట్టి పోటీదారులమని స్పష్టమైన సంకేతాలు పంపారు.

# ప్రత్తిపాడు కాంగ్రెస్ ఇంచార్జి వెంకట్రావు విస్తృత పర్యటన



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఉమ్మిడి వెంకటరావు నియోజకవర్గం లోని పలు గ్రామాల్లో శుక్రవారం విస్తృతంగి పర్యటించారు. పార్టీ సంస్థాగత బలోపేతం లక్ష్యంగా గ్రామ స్థాయి నాయకులతో ఆయన భేటీ అయ్యారు. ఒమ్మంగి గ్రామంలో ఫెలోషిప్ చర్చి అధ్యక్షుడు వల్లూరి రత్నంను కలిసి కాంగ్రెస్ పార్టీకి సహకారం అందించాలని కోరారు. శరభవరం గ్రామంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు విశ్వనాధం సత్యనారాయణ, కేశవరపు వెంకటరమణ, సింగిడి లక్ష్మీతో సమావేశమై పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని అభ్యర్థించారు. చింతలూరులో మైలపల్లి సత్యనారాయణను కలిసి పార్టీ బలోపేతానికి కలిసి పనిచేయాలని పిలుపును ఇచ్చారు. కొత్తూరు గ్రామంలో గొర్ల చంటి అబ్బాయిని మర్యాద పూర్వకంగా కలిసి వారి యోగక్షేమాలు తెలుసు కున్నారు. పోతులూరు గ్రామంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్ మోయేటి సూర్యప్రకాశరావు, ఆయన కుమారుడు మోయేటి నారాయణతో భేటీ అయి గ్రామస్థాయిలో పార్టీ విస్తరణపై చర్చించారు. ఈ పర్యటనలో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు రామకుర్తి సూర్యనారాయణ, దొడ్డి పట్ల సుబ్బరాజు, గోపు అబ్బులు, బి.శ్యామ్ పాల్గొన్నారు.

# ఏపీలో మరో ప్రైవేటు బస్సు బోల్తా

**కడప జిల్లా గోపవరం మండలంలో ప్రైవేటు బస్సు బోల్తా**
**గేదె అకస్మాత్తుగా అడ్డు రావడంతో నియంత్రణ కోల్పోయిన డ్రైవర్**
**ఒక ప్రయాణికుడికి తీవ్ర గాయాలు**




**గోపవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీలో కొంత కాలంగా వరుసగా బస్సు ప్రమాదాలు చోటు చేసుకుంటుండటం ఆందోళన కలిగిస్తోంది. వరుస ప్రమాదాల్లో ఎంతో మంది ప్రాణాలు కోల్పోగా, మరెంతో మంది తీవ్రంగా గాయపడి ప్రాణాలతో బయటపడ్డారు. తాజాగా మరో ప్రైవేటు బస్సు ప్రమాదానికి గురైంది. కడప జిల్లా గోపవరం మండలం పీపీ కుంట సరిహద్దులో బీసీవీఆర్ ట్రావెల్స్ బస్సు ఈ తెల్లవారుజామున బోల్తా పడింది. విజయవాడ నుంచి అనంతపురం జిల్లా కదిరికి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం వివరాల్లోకి వెళితే, బస్సు వేగంగా వెళుతున్న సమయంలో ఒక గేదె అకస్మాత్తుగా అడ్డురావడంతో... దాన్ని తప్పించబోయే ప్రయత్నాన్ని డ్రైవర్ చేశాడు. ఈ క్రమంలో నియంత్రణ కోల్పోవడంతో బస్సు బోల్తా కొట్టింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 30 మంది ఉన్నారు. బస్సు బోల్తా కొట్టినప్పటికీ పెను ముప్పు తప్పింది. కేవలం ఒక ప్రయాణికుడి మాత్రంకాలికి తీవ్ర గాయమయింది. కొంత మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న వెంటనే 108 వాహనం ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం బద్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఈదురుగాలులు, భారీ వర్షాలతో

# విద్యుత్ అంతరాయం

**రాత్రంతా శ్రమించిన విద్యుత్ శాఖ సిబ్బంది - మెజారిటీ ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణ**
**ఎస్ఈ కె.తిలక్ కుమార్**

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లాలో గురువారం రాత్రి వీచిన తీవ్ర ఈదురుగాలులు, భారీ వర్షాల ప్రభావంతో పలు ప్రాంతాల్లో భారీ చెట్లు, హోర్డింగ్లు, ఫ్లెక్సీలు విద్యుత్ లైన్లపై పడిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజనీరు కె.తిలక్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకృతి వైపరీత్యం కారణంగా జిల్లాలోని 33 కెవి ఫీడర్లు 80, 11 కెవి ఫీడర్లు 223 పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందన్నారు. సమాచారం అందుకున్న వెంటనే విద్యుత్ శాఖ అప్రమత్తమై ప్రత్యేక మరమ్మత్తు బృందాలను ఏర్పాటు చేసి యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టిందన్నారు. విద్యుత్ శాఖ అధికారులు, ఇంజనీర్లు, సిబ్బంది రాత్రంతా నిరంతరాయంగా శ్రమించి దెబ్బతిన్న విద్యుత్ లైన్లు, స్తంభాలు, ఇతర పరిక రాలను మరమ్మత్తు చేసి శుక్రవారం తెల్లవారుజామున 2.30 గంటల నాటికి జిల్లాలోని మెజారిటీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించి సాధారణ స్థితికి తీసుకువచ్చినట్లు తెలిపారు. మల్లేశ్వరం సబ్‌స్టేషన్ పరిధిలో ఇంకా పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయని తిలక్ కుమార్ పేర్కొన్నారు. చాగల్లు మండలం మల్లవరం ప్రాంతానికి 11 కెవి ద్వారా ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా అందిస్తున్నామని, 33 కెవి లైన్‌లో విరిగిన స్తంభాల పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. కొద్దిసేపట్లో మల్లేశ్వరం ప్రాంతంలో కూడా పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని చెప్పారు. ఎక్కడైనా విద్యుత్ సరఫరా సమస్యలు ఉన్నచో వినియోగదారులు వెంటనే విద్యుత్ శాఖను సంప్రదించాలని కోరారు. సమాచారం అందిన వెంటనే అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు.

**సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు:**

టోల్ ఫ్రీ నంబర్ : 1912, పర్యవేక్షక ఇంజనీర్, తూర్పుగోదావరి : 9440812583, ఈఈ, రాజమహేంద్రవరం టౌన్ : 9440812585, ఈఈ, రాజమహేంద్రవరం రూరల్ : 7382585487,

**లోడ్ మానిటరింగ్ సెల్స్:** టౌన్ డివిజన్ : 9490610093, రూరల్ డివిజన్ : 9493178874, నిడదవోలు డివిజన్ : 8143700327, సర్కిల్ ఆఫీస్ : 7382299960.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కార్యక్రమంలో సహకరించిన ప్రజలకు విద్యుత్ శాఖ కృతజ్ఞతలు తెలిపింది. అలాగే వర్షాలు, ఈదురుగాలుల సమయంలో విద్యుత్ తీగలు తెగిపడి ఉన్నా, స్తంభాలు దెబ్బతిన్నా వాటికి సమీపంలోకి వెళ్లకుండా వెంటనే విద్యుత్ శాఖకు సమాచారం అందించాలని ప్రజలను కోరింది.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

తూర్పు గోదావరి జిల్లా ఎడిషన్

శనివారం, 30 మే 2026
www.viswamvoice.com



# కేంద్రం ప్రభుత్వం కమిషనుకు గడువు పెంచాలి

## పద్మశ్రీ మందకృష్ణ మాదిగ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** దళిత క్రైస్తవుల అంశం పై వారి ఆర్థిక, సామాజిక అంశాలపై అధ్యాయం చెయ్యడానికి కేజీ.బాలకృష్ణ కమిటీ గడువు మరో 3 నుండి 6 నెలలకు పొడిగించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ అన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరం స్థానిక ప్రైవేట్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2022లో అధ్యయనం చెయ్యడానికి అక్టోబర్‌లో కే.జీ.బాలకృష్ణ కమిషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మరో 10 రోజులు గడువు మాత్రమే కమిషన్ కి ఉందని చైర్మన్ కే.జీ బాలకృష్ణ గతంలో గడువు కావాలని ఎలా అయితే కోరారో, అలాగే మరో 6 నెలలు పొడిగించాలని కోరాలని డిమాండ్ చేశారు. కేంద్రం ప్రభుత్వం సైతం అభ్యర్థన మన్నించాలని కోరారు. దళిత క్రైస్తవుల కమిషన్ అన్ని దళితులు మతం మార్చుకున్న సామాజికంగా, వెనుకబాటుతనం కొనసాగుతుంది కాబట్టి ఎస్సీగా గుర్తించాలని సవరణ తీసుకురావాలని గత కమిషన్‌లు తెలియజేశాయని పేర్కొన్నారు. రాష్ట్రపతి ఆర్డర్ ను సవరించాలని దేశంలో నియమించిన కమిషన్ చెబుతున్నాయని అన్నారు. 1955 లో 2005లో నియమించబడ్డ కమిషన్ సవరించాలని చెప్పిందని తెలిపారు. ప్రధాని మోదీ తిరస్కరించిన దానికి ప్రధాని కారణాలు క్రైస్తవ ఇస్లాం మతంలో మారిన క్రైస్తవులను తప్పుబట్టిందన్నారు. క్షేత్రస్థాయిలో ధ్రువీకరించనందున లోప భూయిష్టమైనది అని తిరస్కరించిందని అన్నారు. 2005 నుండి 06 వరకు నివేదిక అధ్యాయానికి 2 ఏళ్లు తిరిగిందని అన్నారు. బాలకృష్ణ కమిషన్ అధికారకంగా 8 రాష్ట్రాలు తిరిగారని వివరించారు. రంగనాథ కమిషన్ ఏపీ, నుండి మొదలుపెట్టినట్లు తెలిపారు 28 రాష్ట్రాలు తిరిగినవి లోపభూయిష్టం అయితే 8 రాష్ట్రాలు తిరిగి నివేదిక ఇస్తే సరి అవుతుందా అని ప్రశ్నించారు. మిగతా రాష్ట్రాల్లో తిరగాల్సిన అవసరం కే.జీ బాలకృష్ణ కమిషన్‌కు ఉందని అన్నారు. క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేసింది కాదు, 4 గోడలు మధ్య రాసిన రిపోర్ట్ రంగనాథ కమిషన్ అని సొలిసిటర్ అన్నారు. ఢిల్లీలో బాలకృష్ణను కలిసి గడువు కోరాలి అని అడిగితే, ఆయన గడువు కోరను, కేంద్రం గడువు ఇవ్వదు అన్నారని వివరించారు. క్రైస్తవ్యంలో సైతం వివక్ష కొనసాగుతుందని విన్నవించిన బాలకృష్ణ తిరస్కరించారని తెలిపారు. మతం మారినా కులం మారదు అని బి.ఆర్. అంబేద్కర్, గాంధీ, బాబు జగజీవన్ రామ్ అన్నారని వివరించారు. అంటే, గాంధీ మాట ఏమైనా రాజ్యాంగం మా అని బాలకృష్ణ అన్నారని పేర్కొన్నారు. బాలకృష్ణ ఇచ్చే నివేదిక న్యాయబద్ధమైనది కాదు అని మేము భావిస్తున్నామని అన్నారు. దళిత క్రైసవులకి అన్యాయం జరుగుతుందని, గడువు పొడిగించాలని కోరుతున్నామని వివరించారు. కమిషన్ కు గడువు పొడిగిస్తే మరెన్ని ఆధారాలు సమర్పించే అవకాశం ఉందని అన్నారు. అంబేద్కర్ ఆలోచనలకు కే.జీ బాలకృష్ణన్ కమిషన్ నివేదిక వ్యతిరేకం అని అన్నారు. ఈ సమావేశంలో మంగరాజు, అనంతవరపు గాంధీ, బుద్దల కుమార్, బుద్దల రాజు,ఎలక వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నకొండెపూడిలో అకాల వర్షానికి దెబ్బతిన్న

## వెదుళ్ళమ్మ అమ్మవారి జాతర ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే బత్తుల



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం చిన్నకొండెపూడి గ్రామంలో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న శ్రీశ్రీశ్రీ మాతృశ్రీ వెదుళ్ళమ్మ అమ్మవారి జాతర మహోత్సవ ఏర్పాట్లకు అకాల వర్షం అంతరాయం కలిగించింది. గురువారం రాత్రి మండలంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం ధాటికి జాతర ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రధాన సాంస్కృతిక వేదిక (స్టేజి)తో పాటు స్థానికులు, వ్యాపారులు ఏర్పాటు చేసుకున్న పలు దుకాణాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ విషయం తెలుసుకున్న రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ శుక్రవారం ఉదయం స్థానిక నాయకులతో కలిసి జాతర ప్రాంగణాన్ని స్వయంగా పరిశీలించి, వర్షం కారణంగా దెబ్బతిన్న వేదికను, నష్టపోయిన దుకాణాలను చూసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ గ్రామస్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే శ్రీశ్రీశ్రీ మాతృశ్రీ వెదుళ్ళమ్మ అమ్మవారి జాతర ఏర్పాట్లకు అకాల వర్షం వల్ల నష్టం జరగడం బాధాకరమని ముఖ్యంగా జీవనోపాధి కోసం ఇక్కడ దుకాణాలు ఏర్పాటు చేసుకున్న చిన్న వ్యాపారులు, నిర్వాహకులు అధైర్యపడొద్దని జాతర మహోత్సవం ఎటువంటి ఆటంకాలు లేకుండా ప్రశాంతంగా, వైభవంగా జరిగేలా నిర్వాహకులకు, కమిటీ సభ్యులకు ప్రభుత్వం తరపున అన్ని విధాలా తగిన సహకారం అందిస్తామని దెబ్బతిన్న ఏర్పాట్లను త్వరితగతిన పునరుద్ధరించాలని అధికారులకు, స్థానిక కార్యకర్తలకు ఆదేశించామని ప్రస్తుతం వాతావరణం అనుకూ లంగా లేనందున, రానున్న రోజుల్లో కూడా వర్ష సూచన ఉన్నందున జాతరకు వచ్చే భక్తులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కమిటీ సభ్యులు తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్య క్రమంలో ఎమ్మెల్యే వెంట జనసేన, తెలుగుదేశం, బీజేపీ పార్టీల ముఖ్య నాయకులు, గ్రామ పెద్దలు, జాతర కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్న

## ఎమ్మెల్యే ఆదిరెడ్డి దంపతులు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఆయన సతీమణి మాజీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని, వారి తనయుడు ఆదిరెడ్డి జయేష్ నాయుడు తిరుమలలో శ్రీవేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందించి, స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని, రాజమహేంద్రవరం నగర ప్రజల ఆయురారోగ్యాలు, శ్రేయస్సు కోసం శ్రీ వేంకటేశ్వర స్వామివారిని వేడుకున్నారు. దర్శన అనంతరం కుటుంబ సభ్యులు ఆలయ పరిసరాల్లో కొంతసేపు గడిపి స్వామివారి కృపకు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజల అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే నల్లమిల్లి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో జిల్లాలో ప్రజల సమస్యల పరిష్కార వేదికగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జనతా వారధి' కార్యక్రమంవిజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అనపర్తి శాసనసభ్యులు నల్లమల్లి రామకృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షులు పిక్కిన నాగేంద్ర హాజరై, ప్రజల నుండి నేరుగా అర్జీలను అందుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ, జిల్లా పరిధిలోని పలువురు తమ పరిధిలోని ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. గ్రామీణ ప్రాంతాలకు రవాణా సౌకర్యాన్ని మెరుగుపరిచేందుకు కొత్త ఆర్టీసీ బస్సు ప్రారంభించాలని ప్రజలు కోరారు. స్థానిక ప్రాంతాల్లో అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించి, పారిశుధ్య లోపాన్ని నివారించాలని విన్నవించారు. అర్హులైన వారికి పెన్షన్ల మంజూరు, ఇతర వ్యక్తిగత, రెవెన్యూ సమస్యలపై పలువురు అర్జీలు సమర్పించారు. ప్రజల నుండి అందిన అర్జీలపై ఎమ్మెల్యే నల్లమల్లి రామకృష్ణారెడ్డి తక్షణమే స్పందించారు. కార్యక్రమ వేదిక నుండే సంబంధిత శాఖల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, సమస్యల తీవ్రతను వివరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వీలైనంత త్వరగా, కాలపరిమితిలోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ 'జనతా వారధి' కార్యక్రమం బీజేపీ జిల్లా జనరల్ సెక్రెటరీ మరియు జనతా వారధి కన్వీనర్ ఎమ్మెస్సార్ కె.రాజు, జిల్లా కార్యదర్శి, జనతా వారధి కో-కన్వీనర్ స్వామి సూర్య కిరణ్, వై. మీనాక్షి, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి బీజేపీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని తమ సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తెచ్చారు.

స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ సేవలు

## ఆదర్శంగా తీసుకోవాలి

**ముత్యాల దంపతుల సేవలు అభినందనీయం**
**వీరి సేవలు మరింతగా విస్తరించాలి : పులిపాటి దుర్గారెడ్డి**



**ధవలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** శుక్రవారం ఉదయం స్థానిక ధవలేశ్వరం స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయం వద్దకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షులు పులిపాటి దుర్గారెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా విచ్చేసి. ఇక్కడ జరుగుతున్న స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షులు ముత్యాల పోసి కుమార్ సత్యా దంపతుల ఆధ్వర్యంలో జరుగుచున్న నిత్య అన్నదాన కార్యక్రమాన్ని. అభినందించారు. ఈ సందర్భంగా పూలపాటి దుర్గారెడ్డి మాట్లాడుతూ. ధవలేశ్వరం గ్రామంలో స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ పేరుతో అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ ఆదర్శంగా నిలిచిన స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ముత్యాల పోసి కుమార్ సత్య దంపతుల సేవలు మరింతగా విస్తరించాలి, వీరు అభినందనీయులు అన్నారు. అందరూ పోసి కుమార్ ను ఆదర్శంగా తీసుకోవాలని స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ కు తనవంతు సహాయక సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కెవిఆర్ సాగర్, దివ్యాంగులు పాల్గొన్నారు.

సినీ ప్రముఖులు కాశీ విశ్వనాథ్ నివాసంలో సత్యనారాయణ స్వామి వ్రతంలో

## పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం పురుషోత్తపట్నం గ్రామంలో ప్రముఖ సినీ రచయిత, నటులు, దర్శకులు, ప్రసిద్ధ సాహిత్యవేత్త కాశీ విశ్వనాథ్ గృహంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించిన శ్రీ సత్యనారాయణ స్వామి వ్రత మహోత్సవంలో రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ పాల్గొన్నారు. కాశీ విశ్వనాథ్ కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు శుక్రవారం ఆయన నివాసానికి విచ్చేసిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా స్వామివారిని ప్రార్థించారు. ఈ శుభసందర్భంగా కాశీ విశ్వనాథ్ వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణకు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యేను బత్తుల బలరామకృష్ణకు శాలువాతో కప్పి, చిరు సత్కారంతో పాటు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సినీ రంగంలో నటుడిగా, దర్శకుడిగా, రచయితగా తనదైన ముద్ర వేసి, తెలుగు సాహితీ లోకంలో ఎంతో పేరు ప్రఖ్యాతులు సంపాదించిన కాశీ విశ్వనాథ్ ఇంట్లో జరిగిన సత్యనారాయణ స్వామి వ్రతం కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని వారి కుటుంబ సభ్యులందరికీ ఆ సత్యనారాయణ స్వామి కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో కాశీ విశ్వనాథ్ కుటుంబ సభ్యులు, జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరికీ ఫస్ట్ ఎయిడ్ శిక్షణ ఎంతో అవసరం

**- ఐఓసీఎల్ చీఫ్ టెర్మినల్ మేనేజర్ వీహెచ్ ప్రదీప్ బుద్ధ**



**గోకవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రతి ఒక్కరూ ఫస్ట్ ఎయిడ్ శిక్షణ పొందడం ఎంతో ఉపయోగమని ఐఓసీఎల్ చీఫ్ టెర్మినల్ మేనేజర్ వీహెచ్ ప్రదీప్ బుద్ధ అన్నారు. శుక్రవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తూర్పు గోదావరి జిల్లా ఆధ్వర్యంలో గోకవరం మండలం గుమ్మళ్ళదొడ్డి గ్రామంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఓసీఎల్) రాజమండ్రి టెర్మినల్ (మార్కటింగ్ డివిజన్) క్యాంపస్ నందు బేసిక్ ఫస్ట్ ఎయిడ్ శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి సీపీఆర్ గురించి,ఎప్పుడు ఏ సందర్భంలో ప్రమాదం జరిగిన వెనువెంటనే చేయు ప్రథమ చికిత్స గురించి, అగ్ని ప్రమాదం జరిగినప్పుడు, పాముకాటు కు చేయు ప్రథమ చికిత్స ను తెలిపారు. సేఫ్టీ ఆఫీసర్ పీఏ అస్లాం పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో మేనేజర్ ఎమ్ భాస్కరరావు,రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ రమణ,కోశాధికారి డాక్టర్ డాక్టర్ జి మహాలక్ష్మి,ఎమ్సీ సభ్యులు బళ్ళా శ్రీనివాసరావు,ట్రైనర్ చిన్ని సత్యనారాయణ(చంటి),లైఫ్ మెంబర్ పి.చిన్ని, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## రుతుక్రమంపై ప్రతిఒక్కరికీ అవగాహన అవసరం

**మెప్మా జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.కనకరాజు**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మహిళల్లో రుతుక్రమం గురించి ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాల్సిన అవసరం ఉందని మెప్మా జిల్లా ప్రాజెక్ట్ డైరక్టర్ టి.కనకరాజు అన్నారు. అంతర్జాతీయ రుతుక్రమ పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకొని మెప్మా ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ హాలులో మహిళా సంఘాల సభ్యులకు శుక్రవారం అవగాహన కల్పించారు. డిజిటల్ యుగంలోనూ ఋతుక్రమంపై ఉన్న అపోహలు, మూఢనమ్మకాలు, సమాజం స్పందిస్తున్న తీరుపై ఈ సందర్భంగా ప్రాజెక్ట్ డైరక్టర్ మాట్లాడారు. మానవ జాతి మనుగడకు స్త్రీ రుతుక్రమమే మూలమని.. దీనిపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. ఎంహెచ్ఓ ఎ.వినూత్న మాట్లాడుతూ మహిళలు, బాలికలకు రుతుక్రమ సమయంలో పాటించాల్సిన పరిశుభ్రతపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. స్త్రీలలో రుతుక్రమం అనేది సర్వసాధారణమైన విషయమని.. ప్రతి తల్లి ఇంట్లో మగవారికి కూడా దీనిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే రుతుక్రమం వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృత అవగాహన కల్పించారు. పీసీఓడి గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వంటి సమస్యలు పెరగడానికి రుతు పరిశుభ్రత లోపమే కారణమని తెలిపారు. ఈ సమయంలో శానిటరీ ప్యాడ్స్, మెన్స్ట్రల్ కప్స్ వంటి పరిశుభ్రమైన వస్తువులను ఉపయోగించడం, పరిశుభ్రత పాటించడం ద్వారా అనేక గర్భాశయ వ్యాధులను, ఇన్ఫెక్షన్లను నివారించవచ్చన్నారు. అలాగే పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు మరియు బహిరంగ ప్రదేశాలలో మహిళలు మరియు బాలికలకు సురక్షితమైన, పరిశుభ్రమైన వాష్‌రూమ్‌లుఅందుబాటులో ఉండేలా నగరపాలక సంస్థ ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు ఈ సందర్భంగా తెలియజేశారు. అనంతరం మహిళలకు శానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సెక్రటరీ జి.శైలజవల్లి, టెక్నికల్ ఎక్స్ పర్ట్స్ శ్రీదేవి, సీఎంఎం రామలక్ష్మి, డాక్టర్ ప్రసన్న(గైనకాలజిస్ట్), మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్లు, రిసోర్స్ పర్సన్స్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పురుషోత్తపట్నంలో పిడుగుపాటుకు గురైన

## రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే బత్తుల

**ప్రమాదంలో 6 వేల గోనె సంచులు పూర్తిగా దగ్ధం**




**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండల పరిధిలోని పురుషోత్తపట్నం గ్రామంలో గురువారం రాత్రి 9:15 గంటల ప్రాంతంలో తీవ్రమైన ఈదురు గాలులతో కూడిన భారీ వర్షంతో పాటు స్థానిక రైతు సేవా కేంద్రంపై పిడుగు పడటంతో అక్కడ ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘోర ప్రమాదంలో రైతు సేవా కేంద్రంలో నిల్వ ఉంచిన సుమారు 6 వేల గోనె సంచులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ శుక్రవారం ఉదయం స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ప్రమాద స్థలానికి చేరుకున్నారు. దెబ్బతిన్న రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించి, ప్రమాదం జరిగిన తీరును, నష్టాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఘటన జరిగిన వెంటనే సంబంధిత శాఖల అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారని, నష్టాన్ని అంచనా వేస్తున్నారని వివరించారు. ప్రమాద తీవ్రతపై ఉన్నతాధికారులతో మాట్లాడి తదుపరి చర్యలు తీసుకుంటామని, రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికల ప్రకారం జిల్లాలో రానున్న కొన్ని రోజుల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలి. వాతావరణం అనుకూలంగా లేనందున ప్రజలందరూ సురక్షిత ప్రాంతాల్లోనే ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవా లని ప్రజలను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీతానగరం ఎమ్మార్వో శ్రీనివాస్, అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ ఏడి శ్రీనివాస్, ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్, పోలీస్ డిపార్ట్మెంట్, ఫైర్ డిపార్ట్మెంట్ అధికారులు, ఇతర ప్రభుత్వ సిబ్బందితో పాటు జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## థియేటర్లలో కుర్రాళ్లకు
# తెగ నచ్చేసిన సినిమా..


### 3 వారాలకే ఓటీటీలోకి విలేజ్ లవ్ డ్రామా.. స్ట్రీమింగ్ ఎక్కడంటే..



ఇటీవల ఎలాంటి అంచనాలు లేకుండా వచ్చి బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ అయిన సినిమాలు చాలా ఉన్నాయి. బాక్సాఫఈస్ వద్ద మంచి రెస్పాన్స్ అందుకుని కేవలం నెలరోజుల్లోనే ఓటీటీల్లో సందడి చేస్తున్న సినిమాల గురించి చెప్పక్కర్లేదు. ఇప్పుడు మనం మాట్లాడుకుంటున్న సినిమా సైతం కేవలం మూడు వారాలతో డిజిటల్ ప్లాట్ ఫామ్ పై సందడి చేస్తుంది. మేము ఫేమస్ సినిమాతో టాలీవుడ్ ఇండస్ట్రీలో ఓవర్ నైట్ స్టార్ అయ్యాడు సుమంత్ ప్రభాస్. పక్కా విలేజ్ ఫ్యామిలీ డ్రామాతో అడియన్స్ ముందుకు వచ్చి తన నటన, కామెడీ టైమింగ్ తో ప్రేక్షకులను మెప్పించాడు. ఇటీవల ఆయన ప్రధాన పాత్రలో నటించిన మరో విలేజ్ లవ్ స్టోరీ గోదారి గట్టుపైన. మే 8న థియేట్రలలో విడుదలైన ఈమూవీకి యూత్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రానికి సుభాష్ చంద్ర దర్శకత్వం వహించగా.. జగపతి బాబు, లైలా ముఖ్య పాత్రలు పోషఇంచారు. అలాగే ఇందులో నిధి ప్రదీప్ కథానాయికగా నటించింది. థియేటర్లలో విడుదలైన మూడు వారాలకే ఈ సినిమా ఓటీటీలోకి వచ్చేసింది. ప్రస్తుతం ఈ మూవీ ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతుంది. ఎలాంటి ప్రకటన, ప్రచారం లేకుండా సడెన్‌గా ఓటీటీలో సందడి చేస్తుంది ఈ విలేజ్ డ్రామా. కథ విషయానికి వస్తే.. రాజు (సుమంత్ ప్రభాస్) అనే ఆటో డ్రైవర్ తన చెల్లి స్నేహితురాలు మాయ (నిధి ప్రదీప్) అనే అమ్మాయిని ప్రేమిస్తాడు. కానీ మాయ తండ్రి శ్యాంబాబు (జగపతి బాబు) ఒక సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తుంటాడు. అయినప్పటికీ తన కూతురిని ఉన్నత స్థాయిలో ఉన్నవాడికే ఇచ్చి పెళ్లి చేయాలని కోరుకుంటాడు. తన కూతురు ఒక ఆటో డ్రైవర్ ను ప్రేమించిందని తెలిశాక శ్యాంబాబు ఏం చేశాడు.. ? రాజు జీవితంలో ఎలాంటి పరిస్థితులు వచ్చాయి.. ?చివరకు రాజు, నిధిల ప్రేమకు శ్యాంబాబు అంగీకరిస్తాడా ? అనేది సినిమా. ఆద్యంతం కామెడీ టైమింగ్, పక్కా పల్లెటూరి స్టోరీతో ఈ సినిమా కథ సాగుతుంది. మేము ఫేమస్ తర్వాత చాలా కాలం గ్యాప్ తీసుకున్న సుమంత్ ప్రభాస్ ఇప్పుడు గోదారి గట్టుపైన సినిమాతో సూపర్ హిట్ అందుకున్నాడు. ప్రస్తుతం ఈ మూవీ అమెజాన్ ప్రైమ్ ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతుంది.

## అనుమతి లేకుండా నాగ చైతన్య
# పేరు, ఫోటో వాడకూడదు..

### వ్యక్తిత్వ హక్కులకి మధ్యంతర రక్షణ కల్పించిన హైకోర్టు..



అనుమతి లేకుండా తన పేరు, ఫోటోస్ దుర్వినియోగం చేస్తున్నారని.. వాటిని అడ్డుకోవాలని ఇటీవల హీరో నాగ చైతన్య ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై శుక్రవారం విచారణ జరిపిన ఢిల్లీ హైకోర్టు.. నాగ చైతన్య వ్యక్తిత్వ హక్కులకి మధ్యంతర రక్షణ కల్పిస్తూ ఆదేశాలు జారీ చేసింది. అసలేం జరిగిందంటే. ప్రముఖ తెలుగు నటుడు అక్కినేని నాగచైతన్య వ్యక్తిత్వ హక్కులను అనధికారికంగా ఉపయోగించడం నుంచి తాత్కాలిక రక్షణ కల్పిస్తూ ఢిల్లీ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. హీరో అక్కినేని నాగ చైతన్య పేరు, ఫోటోలు, వ్యక్తిత్వాన్ని అనుమతి లేకుండా పోర్నోగ్రాఫిక్ వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ మెర్చండైజ్ విక్రయాలు వివిధ డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లలో దుర్వినియోగం చేస్తున్నారని నాగచైతన్య తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. నాగచైతన్య తరఫున సీనియర్ అడ్వకేట్ వైభవ్ గగ్గర్ వాదనలు వినిపిస్తూ, కొన్ని వెబ్‌సైట్లు నాగ చైతన్య పేరును అసభ్య పదాలతో కలిపి సెర్చ్ ఫలితాల్లో చూపించి వినియోగదారులను ఆకర్షిస్తున్నాయని, నాగచైతన్య ఫోటోలు ముద్రించిన టీ-షర్టులు, ఇతర మెర్చండైజ్ వస్తువులను అనధికారికంగా విక్రయిస్తున్నట్లు ఆన్‌లైన్ లిస్టింగ్‌లు ఉన్నాయని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఎఐ ద్వారా సృష్టించిన, మార్ఫింగ్ చేసిన కంటెంట్ వల్ల నటుడి వ్యక్తిగత జీవితం, గత సంబంధాలపై అభ్యంతరకరమైన వీడియోలు, పోస్టులు కూడా ప్రచారంలో ఉన్నాయని పిటిషన్‌లో కోర్టు దృష్టికి తీసుకెళ్లారు...పోర్నోగ్రాఫిక్ వెబ్‌సైట్లు, హోస్టింగ్ సంస్థలు, ఈ-కామర్స్ ప్లాట్‌ఫారమ్‌లు, వ్యాపార లిస్టింగ్ సైట్లు, గూగుల్, యు ట్యూబ్ వంటి మధ్యవర్తి సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోర్టును కోరారు. కొన్ని అక్రమ మెర్చండైజ్ లిస్టింగ్‌లు లీగల్ నోటీసుల తర్వాత తొలగించినప్పటికీ, సంబంధిత లింకులు , ప్రకటనలు ఇంకా ఇంటర్నెట్‌లో ఉన్నాయని కోర్టుకు తెలిపారు. ఈ నేపథ్యంలో కోర్టు ప్రతివాదులందరికీ సమన్లు జారీ చేసి, వారి సమాధానాలు దాఖలు చేయాలని ఆదేశించింది. ఒక వెబ్‌సైట్ లో కంటెంట్ తొలగించిన తర్వాత కొత్త యుఆర్ఎల్‌లు, వెబ్‌సైట్లు మళ్లీ వస్తున్నందున డైనమిక్ ఇంజంక్షన్ ఇవ్వాలని నటుడి తరఫు అభ్యర్థించారు. ప్రతివాదుల సమాధానాలు అందిన తర్వాత, నాగ చైతన్య వ్యక్తిత్వ హక్కులను అనధికారిక వాణిజ్య వినియోగం ఆన్‌లైన్ దుర్వినియోగం నుంచి ఎంతవరకు రక్షించవచ్చో కోర్టు మరింత వివరంగా కోర్టు పరిశీలించనుంది... ఈ కేసు సెలబ్రిటీల వ్యక్తిత్వ హక్కులు, డిజిటల్ దుర్వినియోగం ఎఐ కంటెంట్ నియంత్రణపై ముఖ్యమైన తీర్పుకు దారి తీయవచ్చని న్యాయవర్గాలు భావిస్తున్నాయి.

# గుజరాత్ గ్రాండ్ విక్టరీ.. ఫైనల్‌లో ఆర్సీబీతో పోరుకు రెడీ..




గుజరాత్ టైటాన్స్ మూడోసారి ఐపీఎల్ ఫైనల్‌కు చేరుకుంది. క్వాలిఫయర్ 2లో ఈ జట్టు రాజస్థాన్ రాయల్స్‌ను 7 వికెట్ల తేడాతో ఓడించింది. మే 31న అహ్మదాబాద్‌లో జరిగే ఫైనల్‌లో గుజరాత్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో తలపడనుంది. గుజరాత్ టైటాన్స్ మూడోసారి ఐపీఎల్ ఫైనల్‌కు చేరుకుంది. క్వాలిఫయర్ 2లో ఈ జట్టు రాజస్థాన్ రాయల్స్‌ను 7 వికెట్ల తేడాతో ఓడించింది. మే 31న అహ్మదాబాద్‌లో జరిగే ఫైనల్‌లో గుజరాత్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో తలపడనుంది. శుక్రవారం ముల్లన్‌పూర్‌లోని మహారాజా యాదవేంద్ర సింగ్ స్టేడియంలో మొదట బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 214 పరుగులు చేసింది. దీనికి సమాధానంగా, గుజరాత్ 18.4 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి లక్ష్యాన్ని చేరుకుంది. అంతకుముందు, రాజస్థాన్ తరఫున వైభవ్ సూర్యవంశీ 47 బంతుల్లో 96 పరుగులు చేయగా, అందులో ఎనిమిది ఫోర్లు, ఏడు సిక్సర్లు ఉన్నాయి. రవీంద్ర జడేజా కూడా 45 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. డోనోవన్ ఫెరీరా కూడా 11 బంతుల్లో 38 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. గుజరాత్ తరఫున కగిసో రబాడా, జాసన్ హోల్డర్ చెరో రెండు వికెట్లు తీయగా, మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ చెరో వికెట్ పడగొట్టారు.

**ఇరు జట్లు:**

**రాజస్థాన్ రాయల్స్ ప్లేయింగ్ :** వైభవ్ సూర్యవంశీ, యశస్వి జైస్వాల్, ధ్రువ్ జురెల్ (కీపర్), రియాన్ పరాగ్ (కెప్టెన్), డోనోవన్ ఫెరీరా, దసున్ షనక, రవీంద్ర జడేజా, జోఫ్రా ఆర్చర్, నాంద్రే బర్గర్, బ్రిజేష్ శర్మ, యశ్ పుంజా.

**గుజరాత్ టైటాన్స్ ప్లేయింగ్ :** శుభమన్ గిల్ (కీపర్), బి సాయి సుదర్శన్, జోస్ బట్లర్ (కీపర్), వాషింగ్టన్ సుందర్, నిశాంత్ సింధు, జాసన్ హోల్డర్, రషీద్ ఖాన్, రవిశ్రీనివాసన్ సాయి కిషోర్, కగిసో రబడ, ప్రసిధ్ కృష్ణ, మహ్మద్ సిరాజ్.

# 6,6,6,6,2,2.. 11 బంతుల్లో 345 స్ట్రైక్ రేట్.. చివరి ఓవర్లో బీభత్సం చూశారా..?




చివరి ఓవర్లలో డొనొవా ఫెర్రీరా సృష్టించిన ఈ సునామీ ఇన్నింగ్స్ మ్యాచ్ ఫలితాన్ని శాసించేలా కనిపిస్తోంది. క్వాలిఫైయర్ వంటి అత్యంత ఒత్తిడితో కూడిన మ్యాచ్‌లో ఇలాంటి విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడటం అతడి మానసిక దృఢత్వానికి నిదర్శనం. ఈ భారీ స్కోరుతో రాజస్థాన్ రాయల్స్ ఫైనల్ వైపు ధీమాగా అడుగులు వేస్తోంది. రాజస్థాన్ రాయల్స్ సరికొత్త చరిత్ర సృష్టించింది. గుజరాత్ టైటాన్స్‌తో జరుగుతున్న హై-వోల్టేజ్ క్వాలిఫైయర్-2 పోరులో ఆ జట్టు మిడిలార్డర్ బ్యాటర్ డొనొవా ఫెర్రీరా ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. మైదానంలోకి వచ్చిన క్షణం నుంచే ప్రత్యర్థి బౌలర్లపై నిర్దయాత్మకంగా విరుచుకుపడి, కేవలం 11 బంతుల్లోనే అసాధ్యమనే స్ట్రైక్ రేట్‌తో మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు.

**ముల్లాన్‌పూర్‌ను వణికించిన సిక్సర్ల వేట..**

ముల్లాన్‌పూర్ వేదికగా సాగుతున్న ఈ కీలక సమరంలో రాజస్థాన్ రాయల్స్ భారీ స్కోరు సాధించడంలో డొనొవా ఫెర్రీరా ఆడిన ఇన్నింగ్స్ అత్యంత కీలకంగా మారింది. ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లలో క్రీజులోకి వచ్చిన ఈ దక్షిణాఫ్రికా విధ్వంసకర ఆటగాడు గుజరాత్ బౌలర్లను ముప్పుతిప్పలు పెట్టాడు. స్టేడియం నలుమూలలా బంతిని సరిహద్దులు దాటించాడు. కేవలం 11 బంతులు మాత్రమే ఎదుర్కొన్న ఫెరీరా, ఏకంగా 345.45 స్ట్రైక్ రేట్‌తో 38 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఇందులో సిక్సర్లు, ఫోర్ల వర్షం కురిపించి స్టేడియంలోని అభిమానులను ఉర్రూతలూగించాడు. ఈ మెరుపు ఇన్నింగ్స్ సాయంతోనే రాజస్థాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 214 పరుగుల భారీ స్కోరును అందుకోగలిగింది. ఈ అద్భుత ఇన్నింగ్స్ ద్వారా ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఒక సరికొత్త మైలురాయి నమోదైంది. ఒకే ఇన్నింగ్స్‌లో కనీసం పది బంతులు ఎదుర్కొని అత్యధిక స్ట్రైక్ రేట్ నమోదు చేసిన రాయల్స్ బ్యాటర్‌గా డొనొవా ఫెర్రీరా అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. విశేషం ఏమిటంటే, ఈ సీజన్ లోనే ఢిల్లీపై కేవలం 14 బంతుల్లో 47 పరుగులు చేసిన రికార్డు కూడా ఇతడి పేరిటే ఉంది. తాజాగా గుజరాత్‌పై చేసిన 345.45 స్ట్రైక్ రేట్ ఇన్నింగ్స్‌తో తన పాత రికార్డును తనే తిరగరాశాడు. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ సన్‌రైజర్స్‌పై నెలకొల్పిన రికార్డును సైతం ఫెరీరా ఈ ఇన్నింగ్స్‌తో అధిగమించడం విశేషం.

**బౌలర్ల గుండెల్లో వణుకు.. డగౌట్‌లో హర్షాతిరేకాలు..**

ఫెరీరా బ్యాట్ ఝుళిపిస్తున్నంత సేపు గుజరాత్ టైటాన్స్ కెప్టెన్, బౌలర్లు ఏం చేయాలో పాలుపోక తలలు పట్టుకున్నారు. యార్కర్లు, స్లో బాల్స్ వేసినా ఫలితం లేకుండా పోయింది. ప్రతి బంతిని మైదానం బయట పడేయడమే లక్ష్యంగా అతడు సాగించిన బ్యాటింగ్ విన్యాసాలు చూసి రాజస్థాన్ రాయల్స్ డగౌట్ మొత్తం లేచి నిలబడి చప్పట్లతో అభినందించింది. డెత్ ఓవర్లలో ఇలాంటి ఒక ఫినిషర్ దొరకడం జట్టుకు కొండంత బలాన్ని ఇచ్చిందని క్రికెట్ విశ్లేషకులు కొనియాడుతున్నారు. చివరి ఓవర్లలో డొనొవా ఫెర్రీరా సృష్టించిన ఈ సునామీ ఇన్నింగ్స్ మ్యాచ్ ఫలితాన్ని శాసించేలా కనిపిస్తోంది. క్వాలిఫైయర్ వంటి అత్యంత ఒత్తిడితో కూడిన మ్యాచ్‌లో ఇలాంటి విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడటం అతడి మానసిక దృఢత్వానికి నిదర్శనం. ఈ భారీ స్కోరుతో రాజస్థాన్ రాయల్స్ ఫైనల్ వైపు ధీమాగా అడుగులు వేస్తోంది.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...



VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com